


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం    తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA    RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 02.01.2026 | సంపుటి : 2 | సంచిక :327 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Friday | 02.01.2026 | volume : 2 | Issue : 327 | Pages : 8 | Cost : 2/- |





## గ్రేటర్ పరిధిలో జిల్లాల విభజన

**ఫ్యూచర్ సిటీతో కొత్త జిల్లాకు ఛాన్స్**

**కసరత్తు చేస్తోన్న ప్రభుత్వం**

హైదరాబాద్, జనవరి 1: హైదరాబాద్ మహానగర పాలక సంస్థను పునర్విభజించిన తరహాలోనే గ్రేటర్ పరిధిలో జిల్లాలను మార్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్, పునర్విభజించిన హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి -మిగతా 2 లో..

### వరుస ఎన్నికల్లో ఓటమితో

# నీటి పంచాయితీ

## రాజకీయ మనుగడ కోసం జలవివాదం

- ఇరు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు
- బిఆర్‌ఎస్ హయాంలో నీటి వాటాలు వదులుకున్నారు
- కెసిఆర్, హరీష్ రావుల సంతకాలు బయటపెడతా

- కేసీఆర్ నోరు తెరిస్తే అబద్దాలే మాట్లాడుతారు
- తెలంగాణ వాటాను మనం వాడుకోలేని దుస్థితికి తెచ్చారు
- అసెంబ్లీలో ఆరోగ్యకరమైన చర్చకు రావాలి
- 'నీళ్లు-నిజాలు' అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్
- మీడియాతో సిఎం రేవంత్ కీలక అంశాలు వెల్లడి

**పాల మూరు సహా అనేక విషయాల్లో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు జలదోపిడీ అంటూ ఆ పార్టీ నేతలు ఆరోపణలు చేస్తున్నారని సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.**

హైదరాబాద్,జనవరి1 : కేసీఆర్ అండ్ కో తమ ప్రభుత్వంపై కావాలనే విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తా రు. తెలంగాణ ఉద్యమానికి నీళ్లే ప్రధాన కారణమని తెలిపారు.నీటి వాటాలపై చర్చ దృష్ట్యా ప్రజాప్రతినిధులకు అవగాహన కోసం 'నీళు-నిజాలు' అంశంపై ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ -మిగతా 2 లో..






### కొత్త ఏడాదిలోనూ ధరల పరుగులు

స్వల్పంగా పెరిగిన బంగారం.. తగ్గిన వెండి




### మనీలాండరింగ్ కేసులో ఈడీ దాడులు


అండర్ అండర్ వరల్డ్ డాన్ ఇందర్జీత్ సింగ్ ఇంట్లో సోదాలు

భారీగా లెక్క చూపని బంగారం, వజ్రాలు, నగదు పట్టివేత

## సందడిగా మారిన లోక్‌భవన్

**గవర్నర్‌కు సిఎం, మంత్రుల శుభాకాంక్షలు**

హైదరాబాద్, జనవరి 1 : న్యూ ఇయర్ సందర్భంగా లోక్‌భవన్‌లో వేడుకలు జరిగాయి. గవర్నర్ విష్ణుదేవ్ వర్మను పలువురు కలిసి అభినందనలు తెలిపారు. దీంతో లోక్‌భవన్ సందడిగా మారింది. సిఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు కలిసి పుష్పగుచ్ఛం అందించి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్ జిష్ణు దేవ్ -మిగతా 2 లో..




## హ్యాపీ న్యూ ఇయర్

**ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ముర్ము, మోడీ**

న్యూఢిల్లీ, జనవరి 1 : పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ.. కొత్త ఆశలతో ప్రపంచం కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టింది. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ దేశవ్యాప్తంగా సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ దేశ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు -మిగతా 2 లో..







## సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రత

**వాతావరణశాఖ అధికారుల అంచనా**

హైదరాబాద్: అత్యల్ప ఉష్ణోగ్రతలు, తీవ్ర చలిగాలులతో డిసెంబర్ నెలలో రికార్డు సృష్టించిన శీతాకాలం.. జనవరి నెలలోనూ అదే స్థాయిలో తన ప్రతాపాన్ని చూపనుంది. డిసెంబర్ నెలలో ఏకంగా 28 రోజులపాటు సాధారణం కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీనికి -మిగతా 2 లో..




### సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మెదక్ ఎంపి రఘునందన్ డిమాండ్

## అసెంబ్లీలో మేమూ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తాం

**బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**

హైదరాబాద్, జనవరి 1 :నదీ జలాలపై కనీస అవగాహన లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు ఉపన్యాసాలు ఇస్తారా అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలనుకుంటే బీఆర్ ఎస్‌కు కూడా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సభలో సమాన -మిగతా 2 లో..



## భారీగా సాగిన మద్యం అమ్మకాలు

**ఎక్సైజ్ శాఖకు న్యూ ఇయర్ కిక్కు**

**డిసెంబరులో రూ.5,102 కోట్ల మద్యం విక్రయం**

హైదరాబాద్, జనవరి 1 : రాష్ట్రంలో మద్యం అమ్మకాలకు నూతన సంవత్సర జోష్ మరింత కిక్కిచ్చింది. మంగళ, బుధవారాలు రెండు రోజుల్లో ఏకంగా రూ.750 కోట్లకుపైగా మద్యం విక్రయాలు జరిగాయి. డిసెంబరు నెలలో మొత్తమ్మీద రూ.5,102 కోట్ల విలువైన -మిగతా 2 లో..





**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 150 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 177 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 257 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88



## మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ

**పోలీసులకు చిక్కిన మావోయిస్టు దేవా**

హైదరాబాద్: మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ తగిలింది. మావోయిస్టుల అగ్రనేత మడావి హిడ్మా స్థానంలో నియమించిన -మిగతా 2 లో..



## నెలరోజుల పాటు రోడ్డు భద్రతా మాసోత్సవాలు

**పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం**

**యాదాద్రి భువనగిరి, జనవరి 1 :** రాష్ట్రంలో నెల రోజుల పాటు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు- 2026 కొనసాగుతాయని రోడ్డు రవాణా శాక మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. యాదగిరి గుట్టలో నేటి నుంచి ప్రారంభం కానున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు 2026 పోస్టర్‌ను -మిగతా 2 లో..

## నీటి హక్కులపై కొట్లాడిందే కేసీఆర్

**అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టొద్దు**

**కేంద్రాన్ని అడుగడుగునా నిలదీశారు..**

**మాజీ మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్: రాష్ట్ర నదీజలాల హక్కులను పరిరక్షించిందే కేసీఆర్ అని, నీటి కేటాయింపు విషయంలో న్యాయం చేసేందుకు కేంద్రంతో అడుగడుగునా కొట్లాడి.. ఎప్పటికప్పుడు నిలదీసింది ఆయనేనని భారాస అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు స్పష్టం చేశారు. భారాస ప్రభుత్వ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు 7 అనుమతులు -మిగతా 2 లో..



# రాజకీయ మనుగడ కోసం జలవివాదం

(మొదటిపేజీ తరువాయి)

కారణమని తెలిపారు. నీటి వాటాలపై చర్చ దృష్ట్యా ప్రజాప్రతినిధుల కు అవగాహన కోసం 'నీళ్లు-నిజాలు' అంశంపై ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలది సంకుచిత స్వభావమని విమర్శించారు. కేసీఆర్ నోరు తెరిస్తే అబద్ధాలే మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నదీ జలాల అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ ప్రజంటేషన్‌కు హాజరై ప్రసంగించారు సీఎం రేవంత్‌రెడ్డి. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై ఏపీ ప్రభుత్వంపై తీవ్ర వత్తిడి తెస్తున్నామని చెప్పుకొచ్చారు. గతంలో కేసీఆర్, హరీశ్‌రావు చేసిన సంతకాలే తెలంగాణకు మరణశాసనంగా మారాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ నీటి చౌర్యం చేస్తున్న.. తెలంగాణ వాటాను మనం వాడుకోలేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషన్ల కోసమే జూరాల నుంచి శ్రీశైలానికి ఆ ప్రాజెక్టును మార్చారని మండిపడ్డారు. తల వదిలేసి తోక దగ్గర నీళ్లు తెచ్చేలా ప్రాజెక్టు డిజైన్ చేశారని విమర్శించారు. ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీల ఒప్పందాన్ని కేసీఆర్ చేశారని ఆరోపణలు చేశారు. ఏపీకి 66శాతం నీళ్లు శాశ్వత హక్కు వచ్చేలా కేసీఆర్ సంతకం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ నీటి లెక్కలు చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదం సృష్టించి.. తద్వారా లబ్ది పొందాలని భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ ప్రయత్నిస్తు న్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రధానంగా నీళ్ల హక్కుల కోసమే తెలంగాణ ఉ ద్యమం జరిగింది. కృష్ణా, గోదావరి జలాలను సక్రమంగా వాడుకుంటే ఎంతో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచి ఉండేది. నీళ్ల కోసం ఉమ్మడి రాష్ట్రంలో పీజేఆర్ స్వంత ప్రభుత్వాన్ని నిలదీశారు. గతంలో నీళ్ల విషయంలో ఎన్నో పొరపాట్లు జరిగాయి. ఆ పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నాం. ఉమ్మడి ఏపీకి కృష్ణా జలాల్లో 811 టీఎంసీలు కేటాయిం చారు. రాష్ట్రం విడిపోయినప్పుడు కృష్ణా జలాల్లో ఏపీకి 512 టీఎం సీలు, తెలంగాణకు 299 టీఎంసీలు అని చెప్పారు. తెలంగాణకు 299 టీఎంసీలు చాలని



అంగీకరిస్తూ పదేళ్ల కాలానికి కేసీఆర్ సంతకం చేశారు. కేసీఆర్ పెట్టిన సంతకం ఏపీకి అడ్వాంటేజ్‌గా మారింది. అప్పుడు ఏపీకి 66శాతం, తెలంగాణకు 34 శాతం జలాలకు ఆయన అంగీకరించారు. తదుపరి బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ తీర్పు రాకుండా వాయిదా వేయిస్తున్నారు. నదీపరివాహకం ప్రకారం చూస్తే.. కృష్ణా జలాల్లో తెలంగాణకు 71శాతం రావాలి. నదీ పరివాహకం ప్రకారం జలాలు కావాలని వాదించాల్సి ఉండగా.. కేసీఆర్ అలా అడగలేదు. కృష్ణాలో 299 టీఎంసీలకు కేసీఆర్ అంగీకరించారని ఇవాళ కేఆర్ఎంబీ అంటోంది. బీఆర్ఎస్ మనుగడ కష్టమని కేసీఆర్ గుర్తించారు.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి పరాజయం పాలైంది. ఎన్నికల్లో వరుస ఓటములతో భారత రాష్ట్ర సమితి మనుగడ కష్టమవుతోందని కేసీఆర్ గుర్తించారు. మళ్లీ జలవివాదం రేపి, ఇరు రాష్ట్రాల మధ్య వైషమ్యాల సృష్టించి తన పార్టీని బ్రతికించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. దాంట్లో భాగంగా ఒక అబద్దాల సంఘాన్ని ఏర్పాటుచేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని అపోహలు సృష్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. పార్టీని బతికించుకునేందుకు మళ్లీ నీళ్ల సెంటి మెంట్‌ను వాడుకుంటున్నారు. చంద్రబాబు పేరు చెప్పి తెలంగాణలో మళ్లీ పార్టీని బతికించుకునేం దుకు ప్రయత్నం చేస్తున్నారు' అని సీఎం విమర్శించారు. పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టుకు కేసీఆర్ ఏడేళ్ల వరకు డీపీఆర్ సమర్పించలేదు. డీపీఆర్ రూపొందించకుండానే రూ.27వేల కోట్లు ఖర్చు చేశారు. డీపీఆర్ రూపొందించలేదు కాబట్టి.. పర్యావరణ అనుమతులు కూడా రాలేదు. అనుమతులు లేని ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని పాలమూరు రంగారెడ్డిపై కేసులు వేశారు. సుప్రీంకోర్టులో కేసులు వేయడంతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సాగునీటి ప్రాజెక్టు కాదని అఫిడవిట్ వేశారు. తాగునీటి కోసం 7.15 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మిస్తున్నామని కోర్టుకు చెప్పారు. కమిషన్ల కోసం పంపులు, లిఫ్టుల కంపెనీలకు రూ.27వేల కోట్లు చెల్లింపులు చేశారు. ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా అయితేనే కమిషన్లు భారీగా వస్తాయని కేసీఆర్ కుట్ర చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జూరాల నుంచి నీటిని తీసుకునేలా రూపొందించారు. జూరాల నుంచి అయితేనే లిఫ్టులు ఎక్కువ పెట్టలేమని భావించిన కేసీఆర్ దాన్ని శ్రీశైలానికి మార్చారు. తల దగ్గర నుంచి నీరు తీసుకునేది వదిలేసి తోక దగ్గర నీళ్లు తీసుకునేలా డిజైన్ చేశారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి 0.25 టీఎంసీలు మాత్రమే తీసుకునే దుస్థితి ఏర్పడింది. ఏపీ ప్రభుత్వం మాత్రం రోజుకు 13 టీఎంసీలు తరలించేలా ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నది. ఏపీలో పనిచేసిన ఆదిత్యనాథ్ దాస్‌ను సలహాదారుగా నియమించుకున్నారని ఆరోపిస్తున్నారు. ఆయనకు తెలంగాణలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై పూర్తి అవగాహన ఉన్నది. కేసీఆర్‌కు ఆహ్వానం పలుకుతున్నా.. శాసనసభలో చర్చ చేద్దాం రండి. సభలో మంచి సంప్రదాయాన్ని నెలకొల్పుదాం అని సీఎం అన్నారు. ఇదిలావుంటే పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయాలంటే రూ.80 వేల కోట్లు అవసరమని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టుపై రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినట్లు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం చెప్పిందన్నారు. నీటి వాటాలపై అసెంబ్లీలో శుక్రవారం చర్చ జరగనున్న దృష్ట్యా 'నీళ -నిజాలు' అంశంపై ప్రజాప్రతినిధులకు అవగాహన కోసం మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఏపీ చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు, ఇతరపథకాలపై ఉ త్తమ్ వివరణ ఇచ్చారు. పాలమూరు ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం రూ. 27 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు. ఇప్పుడు ఆ ప్రాజెక్టు పూర్తి చేయడానికి రూ.80 వేల కోట్లకుపైగా కావాలి. రూ.80వేల కోట్ల ప్రాజెక్టుపై రూ.27వేల కోట్లు ఖర్చు చేస్తే 90 శాతం పూర్తయినట్టా? మేం వచ్చాక రూ.7 వేల కోట్లు ఖర్చు చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం ట్టటెడు మట్టి తీయలేదని ప్రతిపక్షం దుష్ప్రచారం చేస్తోందని ఉ త్తమ్ మండిపడ్డారు.



## సందడిగా మారిన లోక్‌భవన్

హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ కు పుష్పగుచ్చాలు అందించి శు భాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని , ప్రజలకు న్యాయవ్యవస్థ, ప్రభుత్వ ద్వారా మరింత మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా కోరారు. పలువురు మంత్రులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసి విషెస్ చెప్పారు. మంత్రులు వివేక్ వెంకటస్వామి, సీతక్క, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ గవర్నర్ కు పుష్ప గుచ్చం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సహా పలువురు కాంగ్రెస్, బీజేపీ నేతలు గవర్నర్ కు విషెస్ చెప్పారు.



## నీళ్లు-నిజాలుపై మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**హైదరాబాద్:** ప్రజాభవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. 'నీళ్లు-నిజాలు' అంశంపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కృష్ణ-గోదావరి నదీజలాల నీటి కేటాయింపులు, బీఆర్ఎస్ ఆరోపణలపై చర్చ జరిగింది. డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఎంపీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. 2014 నుంచి నేటి వరకు కృష్ణా- గోదావరి నదిలో నీటి కేటాయింపులు, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన ఒప్పందాలపై సీఎం అవగాహన కల్పించారు. రేపు అసెంబ్లీలో నీటి కేటాయింపులపై చర్చ నేపథ్యంలో మంత్రులు, ఎమ్మెల్యేలకు సమావేశంలో అవగాహన కల్పించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు, రెండేళ్ల ప్రభుత్వ పనితీరుపై నేతలు చర్చించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తి చేశామని బీఆర్ఎస్ అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్, హరీష్ చెప్తున్నది అబద్దమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డికి కేసీఆర్ రూ.27 వేల కోట్లు ఖర్చు చేశారని.. పాలమూరు-రంగారెడ్డి పూర్తి కావాలంటే ఇంకా రూ.80 వేల కోట్లు కావాలన్నారు.



## ఎక్సైజ్ శాఖకు న్యూ ఇయర్ కిక్కు

(మొదటిపేజీ తరువాయి)

మద్యం అమ్మకాలు జరిగాయి. డిసెంబరు నెలకు సంబంధించి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ చరిత్రలో అమ్మకాలు, ఆదాయం ఇదే అత్యధికం కావడం గమనార్హం. అటు.. కొత్త మద్యం వ్యాపారులకు కూడా తొలినెలలోనే కాసుల వర్షం కురిసింది. రాష్ట్రంలో మద్యం అమ్మకాలు 2024 డిసెంబరులో రూ.3,800 కోట్లు, 2023 డిసెంబరులో రూ.4,297 కోట్లు మాత్రమే. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి రూ.1,300 కోట్లకుపైగా అధికంగా మద్యం విక్రయాలు జరిగాయి. భారీగా మద్యం విక్రయాలు ఉండవచ్చని అంచనా వేసిన ఎక్సైజ్‌శాఖ స్టాక్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. కాగా, రాష్ట్రంలో 2,620 మద్యం దుకాణాలు ఉన్నాయి. కొత్త మద్యం పాలసీ ద్వారా నవంబర్‌లో దుకాణాలను కేటాయించగా.. డిసెంబరు ఒకటో తేదీ నుంచి కొత్త వ్యాపారులు విక్రయాలు ప్రారంభించారు. వారికి డిసెంబరులో స్థానిక సంస్థల ఎన్నికలు రావడం, తర్వాత క్రిస్మస్, ఇప్పుడు నూతన సంవత్సర వేడుకలు కలిసి వచ్చాయి. డిసెంబరు తొలి రెండు వారాల్లో పెళ్లిళ్లు, పర్యాటక ప్రాంతాల్లో ఈవెంట్లతోనూ మద్యం అమ్మకాలు పెరిగాయి. డిసెంబరు 30న ఒక్క రోజే రూ.375 కోట్ల విక్రయాలు నమోదవగా.. 31న సాయంత్రానికే అమ్మకాలు రూ.350 కోట్లు దాటేశాయి. అర్ధరాత్రి 12గంటల వరకు మద్యం దుకాణాలు, ఒంటి గంట వరకు బార్లు తెరిచి ఉంచేందుకు ఎక్సైజ్‌శాఖ అనుమతి ఇవ్వడంతో అమ్మకాలు మరింత భారీగా నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొత్త వ్యాపారులకు తొలినెలలోనే మంచి ఆదాయం రావడంతో ఆనందం వ్యక్తమవుతోంది.

## మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

బార్సెదేవ అరెస్టు అయినట్లు తెలుస్తోంది. బార్సెదేవను తెలంగాణ పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. రేపు మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దండకారణ్యంలో పార్టీని దూకుడుగా నడిపించిన మావోయిస్టు టాప్ కమాండర్ మడావి హిడ్మా మరణం తర్వాత ఆ స్థానంలో మరో కీలక కమాండర్ కోసం అన్వేషణ సాగింది. హిడ్మాకు సహచరుడు, ఆయన గ్రామం పువర్తికే చెందిన బార్సె దేవాను ఈ కీలక స్థానంలో నియమితులయ్యారు. తాజాగా బార్సెదేవను సైతం తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో మావోయిస్టులకు ఎదురుదెబ్బ తగిలినట్లైంది.

## గ్రేటర్ పరిధిలో జిల్లాల విభజన

(మొదటిపేజీ తరువాయి)

ఒక కొత్త జిల్లాను ఏర్పాటు చేయనున్నారని తెలిసింది. వీటికి సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ కొద్ది రోజుల్లో విడుదల చేయనున్నట్టు సమాచారం. గ్రేటర్ పరిధిలో కొద్దిరోజుల క్రితం వరకు 3 పోలీస్ కమిషనరేట్లు, మూడు జిల్లాలున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధి నాలుగు పోలీస్ కమిషనరేట్లుగా మారిన నేపథ్యంలో మూడు జిల్లాల పరిధిని కూడా మార్చాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించి నట్టు తెలిసింది. హైదరాబాద్, మల్కాజిగిరి జిల్లాల సరిహద్దులను మార్చేందుకు రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు వివరాలు సేకరిస్తున్నారని సమాచారం. హైదరాబాద్ జిల్లాలో మార్పులు.. చేర్పులు చోటుచేసుకో నున్నాయి. జిల్లాలో 16 మండలాలున్నాయి. ఇందులో తిరుమలగిరి, మారేడ్‌పల్లి మండలాలను మల్కాజిగిరి జిల్లాలోకి మార్చనున్నారు. అమీర్‌పేట మండలంలోని బేగంపేట ప్రాంతాన్ని కూడా మల్కాజిగిరి జిల్లాలో భాగం చేయనున్నారు. హైదరాబాద్ జిల్లాల సరిహద్దు మండలాలుగా బండ్లగూడ, బహదూర్‌పురలుండగా... ఇకపై రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాలకు విస్తరించనుంది. ఈ మండలాల్లో జీహెచ్‌ఎంసీ పరిధి ఎంత వరకు ఉంటుందో.. అంతవరకు మాత్రమే హైదరాబాద్ జిల్లా పరిధిలోకి రానుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రస్తుతం సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఉంది. పునర్విభజన అనంతరం మల్కాజిగిరి కమిషనరేట్ పరిధి ఎంతవరకు ఉందో... జిల్లా అంతవరకు విస్తరించనుంది. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్, హయత్‌నగర్ మండలాలు విలీనం కానున్నాయి. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఎల్బీనగర్(రంగారెడ్డి జిల్లా), కంటోన్మెంట్(హైదరాబాద్ జిల్లా) శాసనసభ నియోజకవర్గాలు మేడ్చల్ జిల్లా పరిధిలోకి రానున్నాయి.

మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఉండగా... అది జీహెచ్‌ఎంసీ పరిధి దాటి ఉండడంతో ఈ మండలంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. రంగారెడ్డి జిల్లా పరిధి విస్తృతంగా ఉ ండడం, జిల్లా పరిధిలో ఐటీ సంస్థలు, పరిశ్రమలు, గేటెడ్ కమ్యూనిటీలుండడంతో అర్బన్, రూరల్ జిల్లాలుగా విభజించనున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషరేట్ పరిధి మొత్తాన్ని అర్బన్ జిల్లాగా, ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిని రూరల్ జిల్లాగా విభజించనున్నారు. షాద్‌నగర్, శంషాబాద్ రూరల్ మండలం, చేవెళ్ల, ఆమనగల్లు, కేశంపేట, తలకొండపల్లి, మాడ్గుల, యాచారం, మంచాల, కందుకూరు, మహేశ్వరం మండలాలను రూరల్ జిల్లాగా ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది.

## కమిషనరేట్ పరిధిలో 1198 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

**హైదరాబాద్, జనవరి 1 :** న్యూఇయర్ వేడుకలు నగరంలో అంబరాన్నాంటాయి. చిన్నా ,పెద్ద అనే తాడాలేకుండా పటాకులు కాల్చి, స్వీట్లు పంచి 2026 సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. ఆట, పాటలతో హోరెత్తించారు. ఇళ్లు, కాలనీ అంతాటా సందడి చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా నగరంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా చేపట్టారు. బుధవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు తనిఖీలు చేపట్టారు. కాగా, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1198 మందిపై కేసు నమోదు చేశారు.నిరంతర నిఘా, క్షేత్రస్థాయి సమన్వయంతో అమలు చేసిన భద్రతా చర్యల ఫలితంగా నూతన సవత్సర వేడుకలు సజావుగా సాగాయి.

## అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టొద్దు

(మొదటిపేజీ తరువాయి)




సాధించామని, గత రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కనీసం ఒక్క అనుమతైనా తెచ్చారా? పైగా డీపీఆర్ వెనక్కి వచ్చేలా చేసింది మీరు కాదా? అని ఆయన నిలదీశారు. పదేపదే అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టొద్దని హితవు పలికారు. ప్రజాభవన్‌లో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఒక ప్రకటనలో స్పందించారు. "మీరు గోదావరి-బనకచర్లపై సుప్రీంకోర్టులో పోరాడేదే నిజమైతే.. ఢిల్లీలో సమావేశానికి ఎందుకు వెళ్లారు? కమిటీ ఎందుకు వేశారు? ఈ విషయాన్ని ఎందుకు రహస్యంగా దాచారు? కమిటీ వేయడమంటేనే.. ఏపీ జలదోపిడీకి తలుపులు తెరవడమనే విషయం ప్రజలందరికీ తెలుసు. కృష్ణాలో 763 టీఎంసీలు మీరు అడుగుతున్నట్లుగా అసత్యాలు చెబుతున్నారు. పైగా కేసీఆర్ 299 టీఎంసీలకు ఒప్పుకొన్నారని ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్ 299 టీఎంసీలకు అంగీకరించింది నిజమైతే.. మొత్తం 811 టీఎంసీలు పునఃపంపిణీ చేయాలని.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 42 రోజుల్లోనే ఎందుకు లేఖ రాశారు? ఈరోజు మీరు కొత్తగా 71శాతం వాటా తెలంగాణకు రావాలని మాట్లాడుతున్నారు. ఆనాడే కేసీఆర్ 811 టీఎంసీల్లో 69శాతం తెలంగాణకు దక్కాలని డిమాండ్ చేసిన విషయం మీకు తెలియదా? ఒకవేళ కేంద్రం స్పందించి ఉంటే.. సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్తాం? స్పందించకపోవడంతోనే అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాం. బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ఫైనల్ అవార్డు వచ్చేవరకు.. 50:50 నిష్పత్తిలో నీటి పంపిణీ జరపాలని ఎందుకు 28 లేఖలు రాశాం? రెండు ఎపెక్స్ కమిటీ సమావేశాల్లో కేంద్రాన్ని ఎందుకు నిలదీస్తాం? సెక్షన్-3 ద్వారా కృష్ణా జలాల పునఃపంపిణీ జరిపిస్తామని కేంద్రం హామీ ఇచ్చింది కాబట్టే.. సుప్రీంకోర్టులో కేసు విరమించుకున్న సంగతి మీకు తెలియదా? ఎందుకు ఈ నిజాన్ని దాచిపెట్టి గోబెల్స్ ప్రచారానికి ఒడిగడుతున్నారు?.. అన్ని నదుల నీళ్లు జూరాలకే వస్తాయి.. కొత్తగా శ్రీశైలానికి వచ్చేది ఏమిటని మీరు మాట్లాడారు. ఏటా తుంగభద్ర ద్వారా శ్రీశైలానికి 450-600 టీఎంసీలు వస్తాయనేది తెలుసా? ఈ ఏడాది జూరాలపై ఆధారపడిన ప్రాజెక్టుల కింద 5.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు మీ ప్రభుత్వమే ఎందుకు క్రాప్ హాలిడే ప్రకటించింది? అదే శ్రీశైలంపై ఆధారపడిన కల్వకుర్తికి లోటు లేకుండా ఈ ఏడాది 2.80 లక్షల ఎకరాలకు నీళ్లు అందిస్తున్నది మీ ప్రభుత్వమే కదా? జూరాల, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ రైతులకు ఈ విషయం తెలుసు. దానిపై పాలమూరు-రంగారెడ్డి భారం కూడా పెడితే.. నీళ్లు రాక అందరూ ఆగమైపోరా? పాలమూరు-రంగారెడ్డి మీద ఎన్జీటీలో కేసులకు పురమాయించింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? సభకు వస్తే కేసీఆర్‌ను అవమానించబోమని ఒకవైపు చెబుతూనే.. అదే ప్రెస్‌మీట్‌లో ఆయన్ను కసబ్‌తో పోల్చుతారా? పోలవరం-నల్లమలసాగర్ విషయంలో మేము వేసిన ప్రశ్నకు సూటిగా మీరు ఎందుకు సమాధానం చెప్పలేదు" అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

## కొత్త ఆశలతో.. కొత్త ఏడాదిలోకి ప్రవేశం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. 'నూతన సంవత్సరం సందర్భంగా దేశంలో, విదేశాల్లో ఉన్న భారతీయులందరికీ నా హృదయపూర్వక శు భాకాంక్షలు. ఈ నూతన సంవత్సరం కొత్త శక్తి, సానుకూల మార్పులకు ప్రతీక. ఆత్మపరిశీలనకు, కొత్త సంకల్పాలు తీసుకొనేందుకు మంచి అవకాశం. ఈ సందర్భంగా దేశాభి వృద్ధి, సామాజిక సామరస్యం, పర్యావరణ పరిరక్షణపై మన నిబద్ధతను చాటుకుందాం. ఈ 2026 మనందరి జీవితాల్లో శాంతి, సంతోషం తీసుకురావాలని.. మరింత బలైమన, సుసంపన్నమైన భారత నిర్మాణానికి కొత్త శక్తిని నింపాలని ఆకాంక్షిస్తున్నానని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ ఏడాది అందరికీ శాంతి, ఆరోగ్యం, ఆనందం శ్రేయస్సు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నా. బలమైన, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలనే మన సమష్టి సంకల్పాన్ని బలోపేతం చేయాలని కోరుకుంటున్నట్లు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఈ ఏడాది అందరికీ అద్భుతమైన సంవత్సరం కావాలని కోరుకుంటున్నాను. 2026లో మీ అన్ని ప్రయత్నాలు విజయ వంతం కావాలని.. మంచి ఆరోగ్యం, శ్రేయస్సు ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నా. సమాజం శాంతి, ఆనందంతో ఉండాలని కోరుకుంటున్నట్లు -ప్రధాని మోదీ వెల్లడించారు. అలాగే పలువురు కేంద్రమంత్రులు తమ సందేశాన్ని తెలిపారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## అసెంబ్లీలో మేమూ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తాం

(మొదటిపేజీ తరువాయి)

హక్కులు ఇవ్వాలని, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. 'మేము మీ దగ్గర నుంచి ఏమి నేర్చుకోవాలి. చెక్‌డ్యాంలు ఎలా ఫెయిల్ చేయాలో నేర్పిస్తారా అన్నారు. మేడిగడ్డ ఎలా పేల్చామో చెబుతారా. సుంకిశాల ఎలా కూల్చామో చూపిస్తారా. వట్టెం పంప్ హౌస్ ఎలా ముంచామో వివరిస్తారా. కృష్ణా జలాలపై తెలంగాణ హక్కులన్నింటినీ కేఆర్ఎంబీకి ఎలా ధారాదత్తం చేశారో చెప్పబోతున్నారా. రెండు సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఎకరానికైనా అదనంగా నీళ్లు అందించిందా' అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క చెరువునూ బాగు చేయలేదని, ఒక్క కాలువనూ మ-రమ్మత్తు చేయలేదని విమర్శించారు.

## జనవరిలోనూ వణుకుడే..

(మొదటిపేజీ తరువాయి)

తోడు తూర్పు ఈశాన్య దిశల నుంచి వస్తున్న గాలుల ప్రభావంతో చలి తీవ్రత అధికంగా నమోదైంది. తాజాగా జనవరి నెలలోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ నెల మూడోవారం వరకు కూడా ఉ ష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల మేర తగ్గుతాయని, అడపాదడపా పగటి ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణ స్థితిలో నమోదవుతాయని చెబుతున్నారు. రాష్ట్రానికి ఈశాన్య దిశ నుంచి తక్కువ ఎత్తులో బలమైన గాలుల ప్రభావంతో చలి తీవ్రత పెరుగుతుందని చెబుతున్నారు.

## నెలరోజుల పాటు రోడ్డు భద్రతా మాసోత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ..తెలంగాణలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రతి పౌరుడు రోడ్డు భద్రత మాసోత్సవ అవగాహన సదస్సులో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

# రెండేళ్లు గడిచినా
# హామీల అమలుపై నిర్లక్ష్యం

- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపాటు
- బీఆర్ఎస్ డైరీని ఆవిష్కరించిన కేటీఆర్



**హైదరాబాద్, జనవరి 1 :** క్యాలెండర్లు మారుతున్నాయే తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో ఓటేసిన ప్రజల జీవితాల్లో మాత్రం ఎలాంటి సానుకూల మార్పు రాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రం అభివృద్ధి వైపు కాదు, తిరోగమనం వైపు ప్రయాణిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ భవన్‌లో భారత రాష్ట్ర సమితి నూతన సంవత్సర డైరీని కెటిఆర్ ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ప్రజలకు, భారతదేశ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ 2026 నూతన సంవత్సర సందర్భంగా భావోద్వేగభరిత ప్రసంగం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న పరిస్థితులు, కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టకముందు ఉన్న దుస్థితి మళ్లీ రాష్ట్రానికి తిరిగి వస్తోందని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా నేడు పండుగ వాతావరణంలో ఉన్నప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్నారని, చలి కాలంలో కూడా గంటల తరబడి, దినాల తరబడి లైన్లలో నిలబడాల్సిన దయనీయ పరిస్థితి కాంగ్రెస్ పాలనలో మళ్లీ వచ్చిందని విమర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేస్తూ, కేంద్రంతోనూ సమైక్యవాదులతోనూ 14 ఏళ్లు కేసీఆర్ నాయకత్వంలో సాగిన పోరాటాన్ని కేటీఆర్ స్మరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10 ఏళ్ల పాటు కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం చరిత్రలో చెరగని ముద్రగా నిలిచిందని, ఆ ప్రగతి సంతకాన్ని ఎవరూ తుడిచిపెట్టలేరని స్పష్టం చేశారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారని కేటీఆర్ కొనియాడారు. జెండాను చేతబట్టి నడిపించే నాయకుల కంటే, ఆ జెండాను భూమిలో నిటారుగా పాతి 'ఇది నా జెండా'అని గర్వంగా చెప్పే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని కేటీఆర్ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల నుంచి రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ప్రతి పోరాటం వరకు లగచర్లలో గిరిజనులపై జరిగిన దాడులకు వ్యతిరేకంగా, రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిన తీరుకు వ్యతిరేకంగా, రైతుబంధును రెండు సార్లు ఎగ్గొట్టిన అన్యాయంపై, 'ఆరు గ్యారంటీలు? 420 హామీలు'పై ప్రజా తిరుగుబాటుకు నాయకత్వం వహించిన కార్యకర్తలను కేటీఆర్ అభినందించారు. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న దాష్టీకానికి వ్యతిరేకంగా గళమెత్తిన సోదరులను, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భూముల ఆక్రమణకు నిరసనగా నిలిచిన విద్యార్థులను, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అన్యాయానికి ఎదురు నిలుస్తున్న తెలంగాణ తమ్ముళ్లను, ఆడబిడ్డలను ఆయన ప్రత్యేకంగా స్మరించారు. 2026వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న ఈ శుభసందర్భంలో ఒకటే విషయం గుర్తుంచుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గెలుపులు, ఓటములు శాశ్వతం కావని, అవి తాత్కాలికమని, అప్పుడప్పుడు ఎదురుదెబ్బలు తగులుతాయని, కానీ తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం, గులాబీ జెండా స్థానం మాత్రం శాశ్వతమని స్పష్టం చేశారు. ఇతర పార్టీలకు తెలంగాణ రాజకీయాలు ఒక ఆటలా ఉంటే, తెలంగాణ సాధించిన బీఆర్ఎస్‌కు రాజకీయాలు ప్రజల సంక్షేమానికి సంబంధించిన ధర్మమని, ఒక విధి అని కేటీఆర్ తెలిపారు. గెలుపు–ఓటములతో సంబంధం లేకుండా పార్టీ ప్రయాణం నిరంతరం కొనసాగాలని అన్నారు. ఈ ఏడాది ఒక వైపు పోరాటాన్ని కొనసాగిస్తూనే, మరో వైపు పటిష్టమైన సంస్థాగత నిర్మాణం కూడా అవసరమని కేటీఆర్ స్పష్టం చేశారు. పోరాటం, నిర్మాణం రెండింటినీ ఆధారంగా చేసుకుని ముందుకు సాగాలని, ధర్మం, న్యాయం, నిజాయితీ తమవైపే ఉన్నాయని, అందుకే విజయం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్రం, రాష్ట్రం కలిసి రెండు పార్టీలు ఒకటై బీఆర్ఎస్‌పై దాడి చేస్తున్న పరిస్థితి కనిపిస్తున్నప్పటికీ, ప్రజల ఆశీర్వాదం, దైవ ఆశీర్వాదం ఉన్నంతకాలం ఎవరూ ఏమీ చేయలేరని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు జరిగినా బీఆర్ఎస్‌ను అణచివేయడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. చివరగా 2028లో తిరిగి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడటమే బీఆర్ఎస్ లక్ష్యమని, అదే తమ ధ్యేయమని స్పష్టం చేస్తూ, చిన్నచిన్న ఎదురుదెబ్బలను పెద్దగా పట్టించుకోకుండా జాగ్రత్తగా ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



## నెలరోజుల పాటు రోడ్డు భద్రతా మాసోత్సవాలు

### పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం

**యాదాద్రి భువనగిరి, జనవరి 1 :** రాష్ట్రంలో నెల రోజుల పాటు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు– 2026 కొనసాగుతాయని రోడ్డు రవాణా శాక మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. యాదగిరి గుట్టలో నేటి నుంచి ప్రారంభం కానున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు 2026 పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రతి పౌరుడు రోడ్డు భద్రత మాసోత్సవ అవగాహన సదస్సులో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖ సమన్వయంతో ప్రతి విద్యార్థి దగ్గర, వారి తల్లిదండ్రుల నుండి రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తామనే హామీ పత్రం తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి పాఠశాల రోడ్ సేఫ్టీ క్లబ్‌లో చేరాలని సూచించారు. భవిష్యత్ అంతా రోడ్ సేఫ్టీ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ ప్రయత్నం జరుగుతుందని వివరించారు. నిన్న రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ అధికారులు విడుదల చేసిన నివేదికల్లో అనేక మరణాలు రోడ్డు ప్రమాదాల వల్లే జరుగుతున్నాయని, అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రవాణా శాఖ పక్షాన తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావు , రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## తిరుమల లడ్డూకు భలే గిరాకీ

### భారీగా పెరిగిన ప్రసాదం అమ్మకాలు

**తిరుమల, జనవరి 1 :** గత ఏడాది తిరుమలలో లడ్డూ ప్రసాదాలను రికార్డు స్థాయిలో విక్రయించారు. 2024తో పోలిస్తే 2025లో 10 శాతం అదనంగా భక్తులకు విక్రయించినట్లు టిటిడి తెలిపింది. 2024లో 12.15 కోట్ల లడ్డూలు అమ్మగా.. 2025లో ఆ సంఖ్య 13.52 కోట్లకు చేరినట్లు వెల్లడించింది. గత దశాబ్దకాలంలో ఎన్నడూ లేనివిధంగా డిసెంబర్ 27న 5.13 లక్షల లడ్డూలను భక్తులు కొనుగోలు చేశారని పేర్కొంది. ఏడాదిగా ప్రతిరోజూ 4 లక్షల వరకు లడ్డూలను తయారుచేస్తున్నట్లు టిటిడి తెలిపింది. ముఖ్యమైన రోజుల్లో 8 లక్షల నుంచి 10 లక్షల లడ్డూలు భక్తులకు అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించింది. శ్రీవారి పోటులో 700 మంది సిబ్బంది రెండు షిఫ్టుల్లో శ్రమిస్తూ నియమ, నిష్టలతో ప్రసాదాలను తయారు చేస్తున్నట్లు వెల్లడించింది. ఇటీవల కాలంలో లడ్డూ నాణ్యత, రుచి పెరగడంపై భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు టిటిడి పేర్కొంది.

## పలువురు పోలీస్ సిబ్బంది పదవీవిరమణ

### ఉద్యోగులను సత్కరించి అభినందించిన కమిషనర్



**హైదరాబాద్, జనవరి 1 :** గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో గురువారం జరిగిన పదవీ విరమణ చేసిన పోలీసు సిబ్బందిని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ యం. రమేష్, జాయింట్ సీపీ డాక్టర్ గజరావు భూపాల్,పూలమాలవేసి శాలువతో ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు తెలిపారు. అనంతరం పదవీ విరమణ చేసిన సిబ్బందికి పెన్షన్ పత్రాలను అందజేశారు. పదవీ విరమణ చేసిన వారిలో.. శంషాబాద్ జోన్ ఏడీసీపీ కె. పూర్ణ చందర్, మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్ స్పెక్టర్ కె సత్యా కుమార్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏఆర్ఎస్ఐ జి. వెంకటేశ్వర్లు ఉన్నారు. పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు, సహచరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఆత్మీయ వేడుకలా మార్చారు. రెటైర్ అయిన సిబ్బంది డిపార్ట్‌మెంట్ తో తమ అమూల్యమైన అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్ ఉద్యోగ నిర్వహణలో సుదీర్ఘకాలంగా అంకిత భావంతో పనిచేసి పదవీ విరమణ చేస్తున్న సిబ్బందికి అభినందనలు తెలిపారు. జీవితంలో ముఖ్యంగా ప్రతి మనిషి కృతజ్ఞతా భావం కలిగి ఉండాలన్నారు. పోలీసులు విధుల్లో తీరిక లేకుండా ఉన్నప్పటికీ, కుటుంబ బాధ్యతలను నిర్వర్తించే మహిళలను అభినందిస్తూ సీపీ భావోద్వేగానికి లోనయ్యారు. సమాజంలో ఆన్‌లైన్ బెట్టింగ్ పెద్ద వ్యసనంగా తయారయ్యిందన్నారు. బెట్టింగ్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కొత్తగా వచ్చిన బిఎన్ఎస్ఎస్ చట్టలపై పోలీస్ సిబ్బంది అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు బదిలీ లు జరిగినప్పుడు వారు కో–ఆపరేటివ్ సొసైటీలో జమ చేసుకున్న డబ్బు తీసుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలోనే సంబంధిత ఇతర కమిషనరేట్ కో–ఆపరేటివ్ సొసైటీలతో అవగాహనా ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకుని సమస్య పరిష్కరిస్తామన్నారు.

## సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పటిష్ట చర్యలు

### ట్రాఫిక్ పోలీసుల విస్తృత ఏర్పాట్లు.. పలువురిపై కేసులు నమోదు

**హైదరాబాద్, జనవరి 1 :** సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 2026నూతన సంవత్సర వేడుకలుఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఇన్సిడెంట్ ఫ్రీ/ యాక్సిడెంట్ ఫ్రీ గా ప్రశాంతంగా ముగిశాయి. సైబరాబాద్ పోలీసుల ముందస్తు పకడ్బందీ ప్రణాళికలు, నిరంతర నిఘా, క్షేత్రస్థాయి సమన్వయంతో అమలు చేసిన భద్రతా చర్యల ఫలితంగా నూతన సవత్సర వేడుకలు సజావుగా సాగాయి. డిసెంబర్ 31 న్యూ ఇయర్ సందర్భంగా సైబరాబాద్ సీపీ డాక్టర్ యం. రమేష్ తన కార్యాలయం నుంచే అత్యున్నత స్థాయిలో నేరుగా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులకు ఎప్పటికప్పుడు తగు ఆదేశాలు జారీ చేశారు. సైబరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) డాక్టర్ గజరావు భూపాల్,లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలకు చెందిన డీసీపీలు రాత్రంతా క్షేత్రస్థాయిలోనే ఉండి విధులు నిర్వర్తించారు. ట్రాఫిక్ సజావుగా సాగడం, నిబంధనల కట్టుదిట్టమైన అమలు, ప్రజలు సురక్షితంగా వేడుకలు జరుపుకునేలా విస్తృత చర్యలు చేపట్టారు.రోడ్డు ప్రమాదాలు, ఇతర అనుకోని సంఘటనలు జరగకుండా నివారించేందుకు డిసెంబర్ 31 రాత్రి నుంచి 2026 జనవరి 1 ఉదయం వరకు మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై సైబరాబాద్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. సైబరాబాద్ పోలీసులు 55 బృందాలతో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో మద్యం మత్తులో వాహనాలు నడిపిన 928 మందిని గుర్తించి వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేశారు. వాహనాల వారీగా చూస్తే..మద్యం మత్తులో పట్టుబడిన వారిలో 695 ద్విచక్ర వాహనాలు, 31 మంది త్రిచక్ర వాహనాలు, 199ఫోర్ వీలర్ వాహనాలు, 3 భారీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. నిందితుల డ్రైవింగ్ లైసెన్సులను స్వాధీనం చేసుకుని సంబంధిత ఆర్టీఏలకు పంపనున్నట్లు పోలీసులు తెలిపారు. మియాపూర్, ఆర్‌సీ పురం, రాయదుర్గం, గచ్చిబౌలి, కుకట్‌పల్లి, మేడ్చల్, నార్సింగి, రాజేంద్రనగర్, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా కేసులు నమోదయ్యాయి. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగాసైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల విస్తృత ప్రణాళికలు కారణంగా సైబరాబాద్ పరిధిలో ఎక్కడా పెద్ద రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోలేదని పోలీసులు వెల్లడించారు.న్యూ ఇయర్ సందర్భంగా వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో సైబరాబాద్ పోలీసులు, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులసమన్వయంతో డిసెంబర్ 31 అర్ధరాత్రి నుంచి ఉచిత షటిల్ సేవలను ఏర్పాటు చేశారు.

## ముంబైలో భారీగా బంగారం స్వాధీనం

### ఇద్దరు విదేశీ మహిళల వద్ద 32.79 కేజీల బంగారం పట్టివేత

**ముంబై, జనవరి 1 :** నగరంలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా బంగారాన్ని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. విదేశాల నుంచి వచ్చిన ఇద్దరు మహిళా ప్రయాణికుల నుంచి దాదాపు 32.79 కేజీల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఈ బంగారం విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.19.15 కోట్లు ఉంటుందని కస్టమ్స్ అధికారులు వివరించారు. ఆఫ్రికన్ దేశాల నుంచి ఈ ఇద్దరు మహిళలు వచ్చారని చెప్పారు. వీరిద్దరు వేర్వేరుగా విదేశాల నుంచి వచ్చారన్నారు. ఛత్రపతి శివాజీ విమానాశ్రయంలో దిగిన వీరు.. తీరు అనుమానాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రయాణికులను అదుపులోకి తీసుకుని.. తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. సదరు మహిళల లోదుస్తులతోపాటు లగేజీలో భారీగా బంగారం దాచినట్లు గుర్తించామని కస్టమ్స్ అధికారులు వివరించారు. వీరిద్దరిని అరెస్ట్ చేశామన్నారు.

## న్యూ ఇయర్ వేడుకల్లో అపశృతి

### స్విస్ హోటల్‌లో పేలుడుకు 40మంది మృతి

**న్యూఢిల్లీ, జనవరి 1 :** నూతన సంవత్సరం వేళ స్విట్జర్లాండ్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ స్కీ రిసార్ట్ నగరం క్రాన్స్ మోంటానాలో ఓ బార్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 40 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది. ఈ మేరకు స్థానిక అధికారిక వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మరో 100 మందికి గాయపడినట్లు తెలిపాయి. మృతుల సంఖ్యపై అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. బార్‌లో నూతన సంవత్సర వేడుకలు జరుగుతుండగా అర్ధరాత్రి 1.30 గంటలకు ఈ పేలుడు చోటుచేసుకుంది. పేలుడు ధాటికి భారీగా మంటలు చెలరేగాయి. సమాచారమందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఈ ఘటనలో ఉగ్ర కుట్ర లేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. బాణసంచా కారణంగా ఈ పేలుడు సంభవించి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. స్విస్ ఆల్ప్స్ పర్వతశ్రేణుల నడుమ ఉన్న ఈ క్రాన్స్ మోంటానా నగరం ప్రముఖ పర్యాటక స్థలం. ఏటా డిసెంబరు–జనవరి సమయంలో ఇక్కడ పర్యాటకుల తాకిడి విపరీతంగా ఉంటుంది. గత కొంతకాలంగా ఇక్కడ కార్చిచ్చులు చోటుచేసుకుంటున్నట్లు సమాచారం.

## న్యూ ఇయర్ వేడుకల్లో విషాదం

### హైదరాబాద్‌లో బిర్యాని తిని ఒకరు మృతి

**హైదరాబాద్, జనవరి 1 :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 31 రాత్రి న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ గ్రాండ్‌గా జరుపుకున్నారు. పబ్బులు, క్లబ్బులు, ఫామ్ హౌస్, రిసార్ట్స్ కొంతమంది సొంత రూముల్లో న్యూ ఇయర్ సంబరాలు చేసుకున్నారు. కొత్త ఏడాదిలో కొన్నిచోట్ల విషాదాలు చోటు చేసుకున్నాయి. న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా బిర్యాని తిని ఒకరు మృతి చెందగా, 15 మంది తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషాద ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని భవానినగర్‌లో జరిగింది. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ సందర్భంగా 17 మంది మద్యం సేవించి చిల్ అయ్యారు. బిర్యానీ తిన్న పాండు(53) అస్వస్థతకు గురై చనిపోయాడు. మరో 15 మంది అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. వాళ్లందరినీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తు న్నారు. ఇదిలా ఉంటే.. హైదరాబాద్‌లో న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. అనుమానితులను తనిఖీలు చేశారు. ఈ క్రమంలోనే నార్సింగ్‌లో డ్రగ్స్‌తో ఇద్దరు యువకులు పట్టుబడ్డారు. రాజమండ్రికి చెందిన శ్రీనివాస్ కళ్యాణ్, గోవాకు చెందిన విజయ్ డ్రగ్స్ తీసుకున్నారని,వారిని టెస్ట్ చేయగా పాజిటీవ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు.



## రూ.5కే మినరల్ వాటర్

- కొత్త సంవత్సర వేళ మహిళా సర్పంచ్ కానుక
- ఇచ్చిన హామీని నెరవేర్చే యత్నం

**రాజన్నసిరిసిల్ల, జనవరి 1 :** పంచాయితీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఓ మహిళా సర్పంచ్ నెరవేర్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం రామన్న పల్లె గ్రామంలో ప్రతి ఇంటికి రూ.5 కే మినరల్ వాటర్ అందించేందుకు సర్పంచ్ ఆత్మకూరు జ్యోతి శ్రీకారం చుట్టారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తాను గెలిస్తే ప్రతి ఇంటికి మినరల్ వాటర్ ను రూ.5 కే అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు నూతన సంవత్సర పురస్కరించుకొని గురువారం రూ. 5లకే మినరల్ వాటర్ సరఫరాను గ్రామస్తుల సమక్షంలో ప్రారంభించారు. గ్రామంలోని ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకుడితో మాట్లాడి రూ.5 కే మినరల్ వాటర్ బబుల్ అందించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. మినరల్ వాటర్ బాబుల్ కి రూ.10 కి అందిస్తుండగా, ఇందులో సర్పంచ్ జ్యోతి రూ.5 లను నిర్వాహకుడికి చెల్లిస్తారు . తన పదవి ముగిసేవరకు రూ.5 కే మినరల్ వాటర్ అందిస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామస్తులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఇప్పటికే గ్రామంలో ఎవరైనా మృతి చెందిన అంత్యక్రియలకు రూ. 5వేలు అందిస్తుండగా, నూతన సంవత్సరం వేల రూమ్ 5 కే ప్రతి ఇంటికి మినరల్ వాటర్ సరఫరా ప్రారంభించడంతో గ్రామంలో సర్వత్ర హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గణపురం శ్రీనివాస్ ,మేడుదుల ఎల్లవ్వ, పలుమారి లింగవ్వ , గణపురం తేజ , మందాటి తిరుపతి , సౌండవేని లచ్చయ్య , ఆత్మకూరు ముత్తయ్య , ఆత్మకూరు కరుణాకర్, ఆత్మకూరు శ్రీనివాస్, జీల చిన్న ఎల్లయ్య ఉన్నారు.

## గచ్చిబౌలిలో యువకుడు అనుమానాస్పద మృతి

**హైదరాబాద్, జనవరి 1 :** గచ్చిబౌలిలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బుధవారం రాత్రి కొండాపూర్ శ్రీరాం నగర్ కాలనీ నుంచి బోటానికల్ గార్డెన్ వైపు.. పాలపిట్ట పార్క్ సమీపంలోని రహదారిపై శంకర్ (19) అనే యువకుడు నిర్జీవంగా పడి ఉన్నాడు. అదే రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే స్పందించి.. అతడి జేబులోని సెల్ ఫోన్ ద్వారా అతని స్నేహితులకు సమాచారం ఇచ్చారు. స్నేహితులు వెంటనే పాలపిట్ట పార్క్ వద్దకు చేరుకుని శంకర్‌ను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అతడు అప్పటికే మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. శంకర్ సోదరుడు పోలీసులను ఆశ్రయించాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శంకర్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పాలపిట్ట పార్క్ సమీపంలో సీసీ ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. అతడి మృతి గల కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు. మృతుడు శంకర్.. నగరంలోని ఒక ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

## భారీగా పెరిగిన ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు

**న్యూఢిల్లీ, జనవరి 1 :** విమానాల్లో వినియోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలను ప్రభుత్వరంగ చమురు కంపెనీలు భారీగా తగ్గించాయి. విమానయాన రంగానికి ఊరట కల్పిస్తూ ఏటీఎఫ్ ధరలో 7.3 శాతం మేర కోత పెట్టాయి. అదే సమయంలో కమర్షియల్ సిలిండర్ ధరలను రూ.111 చొప్పున పెంచాయి. నెలవారీ మదింపులో భాగంగా అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా చమురు సంస్థలు ఈ ధరల సవరణ చేపట్టాయి. పెరిగిన ధరలు నేటినుంచే అమల్లోకి రానున్నాయి. ధరల సవరణ తర్వాత దిల్లీలో ఏటీఎఫ్ ధర కిలో లీటరుకు రూ.7,353.75 తగ్గి రూ.92,323.02కి చేరింది. అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లలో వరుసగా మూడుసార్లు ఏటీఎఫ్ ధరలను పెంచుతూ వచ్చాయి. చమురు కంపెనీల తాజా నిర్ణయంతో విమానయాన సంస్థలపై ఆర్థికంగా భారం తగ్గనుంది. విమానాలు నడిపేందుకు అయ్యే మొత్తం ఖర్చులో ఏటీఎఫ్‌దే 40 శాతం వాటా. స్థానిక ట్యాక్సుల కారణంగా ఏటీఎఫ్ ధర దేశంలోని ఒక్కో నగరంలో ఒక్కోలా ఉంటుంది. మరోవైపు 19 కేజీల కమర్షియల్ సిలిండర్ ధరను చమురు కంపెనీలు రూ.111 చొప్పున పెంచాయి. తాజా నిర్ణయంతో దిల్లీలో కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,691.50కి చేరింది. గత రెండు నెలలుగా ఈ ధరలను చమురు కంపెనీలు తగ్గించుకుంటూ వచ్చాయి. ధరల పెంపు నిర్ణయంతో హోటళ్లు, రెస్టరంట్లపై భారం పడనుంది. అదే సమయంలో ఇంట్లో వాడే ఎల్‌పీజీ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. చివరిసారిగా 2025 ఏప్రిల్‌లో రూ.50 చొప్పున పెంచాయి. అంతర్జాతీయ ధరలు, రూపాయి మారకం విలువ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఐఓసీ, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం ఏటీఎఫ్, ఎల్‌పీజీ ధరలను ప్రతినెలా ఒకటో తేదీన సవరిస్తుంటాయి.

## భారత్ సార్వభౌమాదికారాన్ని తక్కువ చేసే యత్నం

### చైనా తీరుపై మండిపడ్డ ఎంపి అసదుద్దీన్

**హైదరాబాద్, జనవరి 1 :** భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలను తొలగించేందుకు తమ దేశం మధ్యవర్తిత్వం వహించిందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ పేర్కొనడాన్ని ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు, లోక్‌సభ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఖండించారు. చైనా చేసిన ఆ వ్యాఖ్యలపై తన సోషల్ మీడియా పోస్టులో స్పందించారు. ఇండోపాక్ ఉద్రిక్తతలను తగ్గించినట్లు చైనా చెప్పడం అవమానకరమని, ఆ వ్యాఖ్యలకు కేంద్ర సర్కారు గట్టి బదులు ఇవ్వాలని అన్నారు. భారతీయ హుందాతనాన్ని, సార్వభౌమత్వాన్ని చైనా తక్కువ చేసి మాట్లాడడం సరికాదు అన్నారు. ఆపరేషన్ సింధూర్ వేళ ఇండోపాక్ మధ్య తీవ్ర సంక్షోభం నెలకొన్నదని, వాణిజ్య బెదిరింపులతో శాంతి నెలకొల్పినట్లు ట్రంప్ చెప్పారని, ఇప్పుడు చైనా మంత్రి కూడా ఇలాంటి ప్రకటన చేయడం భారత్‌ను కించపరచడమే అవుతుందని ఓవైసీ అన్నారు. చైనా వ్యాఖ్యలను భారత్ బలమైన రీతిలో వ్యతిరేకించాలన్నారు. భారత్, పాకిస్థాన్ దేశాలను ఒకే స్థాయిలో పెట్టి, దక్షిణాసియాలో మేటి దేశంగా మార్కులు కొట్టేసేందుకు చైనా ప్రయత్నిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. చైనా పర్యటనకు వెళ్లిన సమయంలో ప్రధాని మోదీ ఈ విషయాన్నే అంగీకరించారా అని నిలదీశారు. ఇండోపాక్ సమరాన్ని మధ్యవర్తిత్వం ద్వారా ఆపినట్లు చైనా చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం అధికారికంగా ఆ వ్యాఖ్యలను ఖండించాలని, మూడవ దేశం జోక్యం చేసుకోలేదన్న విషయాన్ని చెప్పాలని ఓవైసీ కోరారు.

# అసెంబ్లీ ముందుకు నీటి తగాదాలు




**గురువారం 2వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కేవలం నీటి జలాలలపై మళల్ఈ పంచాయితీకి బిఆర్ఎస్ సిద్ధం అవుతోంది. కృష్ణా,గోదావరి జలాల విషయంలో ఏపీ ప్రభుత్వం, కేంద్రం అనుసరిస్తున్న తీరును ప్రధానంగా ప్రస్తావించడం ద్వారా రేవంత్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం అవుతోంది. రేవంత్ సర్కార్ కూడా నదీజలాల వాటా విషయంలో పదేళ్లుగా కెసిఆర్ ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేసిందని నిలదీసేందుకు వ్యూహాలను సిద్ధం చేసింది. మొత్తంగా మరోమారు అసెంబ్లీ వేదికగా నీటిమంటలు చూడబోతున్నాం. విభజన తరవాత రెండు రాష్ట్రాల్లో కలిసి పురోగించాలని అనుకున్నా.. నీటి కయ్యాలతో రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ నేతలు మంటలు పెట్టాలని చూస్తున్నారు.**

నదీ జలాలలను ఉపయోగించడంలో ఉమ్మడి ఏపీలో కాని, విడివడ్డాక కానీ పాలకులకు దూరదృష్టి లేకపోవడంతో రాజకీయాలు ముసురుకుంటున్నారు. వృథా జలాలలను కాపాడుకునే బదులు, ఇరు రాష్ట్రాల్లోనూ పాలకులు రాజకీయాలకు ప్రాధా న్యం ఇస్తున్నారు. పోలవరం పదేళ్లయినా పూర్తి కాలేదు. దీనిని ఇంకా సాగతీస్తున్నారు. జగన్ హయాంలో బటన్ నొక్కుడు, ప్యాలెల్‌లు కట్టడం, ఇసుక, మద్యం మాఫియాలతో గడిపారు. రాజధాని, పోలవరంలను పూర్తిగా విస్మరించారు. ఇప్పుడు చంద్రబాబు కూడా అదే పద్ధతిలో పోలవరం ఇతర ప్రాజెక్టులు పూర్తి చేయకుండా బనకచర్ల తదితర ప్రాజెక్టులతో ప్రజల్లో విభేదాలు సృష్టించే ప్రయత్నాల్లో ఉన్నారు. తెలంగాణలో కెసిఆర్ హయాంలో కట్టిన కాళేశ్వరం కూలిపోవడం ఒక ఎత్తయితే దానిని నిర్వహించే స్థోమత లేకుండా లక్షల కోట్లు వృధా చేశారు. ఇతర ప్రాజెక్టులను పూర్తి చేయలేదు. ఇలా దూరదృష్టి లేని పాలకుల వల్ల నీటి సమస్యలు వస్తున్నాయి. పోలవరం–నల్లమల లింక్ ప్రాజెక్టు లక్ష్యం గోదావరి జలాలనే కాదు కృష్ణా జలాలను సైతం కొల్లగొట్టడమే అని ఇప్పుడు బిఆర్ఎస్ వాదిస్తోంది. అయితే గతంలో జగన్ సిఎంగా ఉండగా రాయలసీమను రతనాల సీమ చేస్తామని కెసిఆర్ అన్న మాటలను మరచిపోరాదు. ఇప్పుడు ఆ దిశగానే ఏపీ సర్కారు ప్రణాళికలను రూపొందించుకుని ముందుకు సాగుతున్నది. పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్టులో చేసిన ప్రతిపాదనల్లో స్వల్ప మార్పులతో యథాతథంగా కొనసాగించడమే అందుకు నిదర్శనంగా నిలుస్తున్నదని బిఆర్ఎస్ వాదనగా ఉంది.

ఇప్పటికే శ్రీశైలం నుంచి బనకచర్లకు దొడ్డిదారిలో నీటిని తరలించుకుపోతున్న ఏపీ.. అదే శ్రీశైలం బ్యాక్‌వాటర్ ఆధారంగా నిర్మించిన వెలిగొండ ప్రాజెక్ట్‌లోని ఓ భాగమైన నల్లమల సాగర్‌కు పోలవరం నుంచి నీటిని తరలించాలని పఎలాన్‌చేసిందన్నది బిఆర్ఎస్ నేతల ఆరోపణగా ఉంది. అంతేకాదు భవిష్యత్తులో బనకచర్ల లింక్‌ను కూడా పూర్తి చేస్తామని చెప్పకనే చెబుతున్నది. ఇందులో భాగంగా 200 టీఎంసీలు తరలించాలనుకున్న ఏపీ.. ఇప్పుడు పీఎన్ లింక్‌లోనూ అంతే మొత్తంలో నీటిని తరలించుకు పోనున్నది. పీఎన్ లింక్ ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి ఇప్పటికే టెండర్లను పిలిచింది. లింక్‌లో భాగంగా పోలవరం కుడికాలువ నుంచి మొదటిదశలో ప్రకాశం బరాజ్‌కు, రెండో దశలో ప్రకాశం బరాజ్ నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు జలాలను తరలించాల్సి ఉంటుంది. ప్రకాశం బరాజ్ నుంచి జలాలను ఈ రిజర్వాయర్‌కు తరలించే కాలువ నాగార్జునసాగర్ కుడికాలువను దాటుకొని వెళ్లాల్సి ఉంటుంది. నాగార్జునసాగర్ కుడికాలువ దాదాపు 202 కి.మీ పైగా ఉంటుంది. అందులో 80 కి.మీ పాయింట్ వద్ద పీఎన్ లింక్ కెనాల్, సాగర్ కుడికాలువలు కలుస్తాయి. ఏపీ సర్కారు గతంలోనే కుడికాలువను ఆ పాయింట్ నుంచి మరింత విస్తరించి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు అనుసంధానిస్తామని వెల్లడించిందన్నది బిఆర్ఎస్ వర్గాలు చేస్తునన వాదన. నిజానికి ఇదంతా వృధా జలాల ఉపయోగమే అని ఎపి వాదిస్తోంది. ప్రస్తుతం మాత్రం పీఎన్ లింక్ కెనాల్‌ను సాగర్ కుడికాలువతో కలుపబోమని, అక్విడెక్ట్ ద్వారా జలాలను తరలిస్తామని చెబుతున్నది.

పరిమితులకు మించి పోలవరం కుడి కాలువ, పోతిరెడ్డిపాడు కాలువల తదితర నిర్మాణాలు, వివిధ ప్రాజెక్టులతో చేసిన అనుసంధానాల వల్ల ఎపి జలదోపిడీ చేస్తున్నా అధికార కాంగ్రెస్ పట్టించుకోవడం లేదన్నది ఆరోపణ. భవిష్యత్‌లో గోదావరి జలాలనే కాదు సాగర్ నుంచి కృష్ణా జలాలను కూడా బొల్లాపల్లి రిజర్వాయర్‌కు తరలించే అవకాశమున్నది. ప్రస్తుతం బొల్లాపల్లి రిజర్వాయర్‌ను 173 టీఎంసీలతో చేపడుతున్నా, భవిష్యత్‌లో 400 టీఎంసీలకు పెంచుకునే వెసులుబాటు ఉందని అంటోంది. బొల్లాపల్లితో అనుసంధానిస్తే కృష్ణాకు సంబంధించి అతిపెద్ద రిజర్వాయర్ ఏపీకి అందుబాటులోకి వస్తుంది. ఈ నేపథ్యంలోనే పీఎన్ లింకుతో అనుసంధానించేందుకు ఏపీ లోపాయికారీగా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నది. సూటిగా చెప్పాలంటే కృష్ణా జలాలకు సాగర్ నుంచి కూడా గండికొట్టే అవకాశం ఏపీకి దక్కుతుందని బిఆర్ఎస్ వాదనగా ఉంది. ఇదే అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించడం ద్వారా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడమే గాకుండా నిలదీయాలన్నది బిఆర్ఎస్ వ్యూహంగా ఉంది. ఇప్పటికే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా ఏపీ ఏటా కేటాయింపులకు మించి కృష్ణా జలాల దోపిడీకి పాల్పడుతున్నది. చెన్నైవాసుల దాహం తీర్చేందుకు మానవతా దృక్పథంతో కృష్ణా బేసిన్‌లోని నాటి కర్నాటక, మహారాష్ట్ర, ఉమ్మడి ఏపీ రాష్ట్రం 5 టీఎంసీల చొప్పున 15 టీఎంసీల నీటిని అందివ్వాలని ఒప్పందం కుదిరింది. ఆ నీటి సరఫరా బాధ్యతను కృష్ణా బేసిన్‌లో దిగువన ఉన్న ఉమ్మడి ఏపీ ప్రభుత్వానికి కట్టబెట్టాయి. మిగుల జలాల నుంచి ఏటా ఒప్పందం మేరకు నీటిని చెన్నైకి ఇవ్వాల్సి ఉంది. అంతవరకు బాగానే ఉన్నా ఆచరణలో మాత్రం పెద్దన్నపాత్ర ముసుగులో చెన్నైకి తీరని ద్రోహాన్ని తలపెట్టడం మొదలుపెట్టింది. ఉమ్మడి పాలకులు కృష్ణా జలాలను జలదోపిడీకి తెరలేపారన్నది వాదన. ఇప్పటివరకు శ్రీశైలం నుంచే కృష్ణాజలాలను కొల్లగొడుతున్న ఏపీ, ప్రస్తుతం సాగర్ నుంచి కూడా కృష్ణా జలాలను మళ్లించేందుకు సిద్ధమైందన్న వాదనతో బిఆర్ఎస్ ముందుకు వస్తోంది. ఈ క్రమంలో అసెంబ్లీలో అటు అధికార, విపక్షాల మధ్య నీటి మంటలు చెలరేగనున్నాయి.

# చలి గుప్పిట్లో తెలుగు రాష్ట్రాలు

## పలుచోట్ల పొగమంచుతో ఇబ్బందులు



**హైదరాబాద్, జనవరి 1 :** ఏపీ, తెలంగాణా రాష్ట్రాలు చలి గుప్పిట్లో చిక్కుకున్నాయి. ఎన్నడూలేని విధంగా గత నెలరోజుల నుంచి ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు వణికిపోతున్నారు. ప్రస్తుతం.. తెలంగాణ వ్యాప్తంగా సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవు తున్నా యి. తెలంగాణ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురియడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్‌లో నూతన సంవత్సరం రోజు మంచుదుప్పటి పరచుకుంది. దీంతో ఉదయం 9 గంటలు దాటినా సూరీడు దర్శనమివ్వలేదు. ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. కోహిర్, సిర్పూర్ ప్రాంతాల్లో నెల రోజులుగా 5 నుంచి 6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆసిఫాబాద్, మంచి ర్యాల, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, జనగాం, మెదక్, రంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో చలి తీవ్రత బాగా పెరిగిపోయింది. నగర శివారు ప్రాంతాల్లోనూ పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. అక్కడి ప్రాంతాల్లో 8 నుంచి 12 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక.. ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో విపరీతమైన చలి ప్రభావం కనిపిస్తోంది. రాబోయే మూడు రోజుల్లో కోస్తాంధ్ర, యానాం, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 2–3 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ తీర ప్రాంతాల్లోనూ కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశము ందని ఐఎండీ అంచనా వేస్తోంది. జనవరి 1 తర్వాత వాతావర ణంలో చాలా మార్పులు ఉండే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం కూడా విపరీతంగా చలి తీవ్రత కనిపిస్తోంది. ఉత్తర భారతదేశం నుంచి చల్లటి పవనాలు వీదయడం వల్లనే ఉష్ణోగ్రతలు తగ్గాయని ఐఎండీ పేర్కొంది.

# పబ్బులపై ఈగిల్ టీమ్‌ల దాడులు

## డ్రగ్స్ వాడిన డీజేల అరెస్ట్

**హైదరాబాద్, జనవరి 1 :** భాగ్యనగరంలో డ్రగ్స్ వినియోగంపై ఈగల్ టీమ్ కఠిన చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో పబ్బులపై నిర్వహించిన ఆకస్మిక సోదాల్లో డ్రగ్స్ వినియోగాన్ని గుర్తించారు. సిటీలోని నాలుగు ప్రముఖ పబ్బుల్లో ఈగల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఐదుగురు డీజేలు డ్రగ్స్ తీసుకొని మ్యూజిక్ ఆపరేట్ చేస్తున్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అధికారుల విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. బఫెలో వైల్డ్ వింగ్స్, షెర్లాక్ ఇల్యూషన్, వేవ్ పబ్‌లలో పనిచేస్తున్న డీజేలు డ్రగ్స్ ప్రభావంలో మ్యూజిక్ నిర్వహిస్తున్నారని అధికారులు నిర్ధారించారు. ఈ ఘటనలో శ్రీధర్, డేవిడ్, తన్వీర్ సింగ్, మణిభూషణం, రవికృష్ణ అనే ఐదుగురు డీజేలను పోలీసులు అరెస్ట్ చేశారు. పబ్బుల్లో యువతను ఆకర్షించే విధంగా డీజేలు డ్రగ్స్ వినియోగిస్తూ మ్యూజిక్ ప్లే చేస్తున్నారని తెలిపారు. పబ్బుల సంస్కృతిలో డ్రగ్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భాగ్యనగరంలో డ్రగ్స్ రహిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా తమ సోదాలు కొనసాగుతాయని ఈగల్ అధికారులు స్పష్టం చేశారు. పబ్బుల నిర్వాహకుల పాత్రపై కూడా విచారణ చేపడుతున్నట్లు సమాచారం. ఈ ఘటన నేపథ్యంలో నగరంలోని పబ్‌లపై అధికారులు మరింత నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

## మెదక్ ఎంపి రఘునందన్ డిమాండ్



**సిద్దిపేట, జనవరి 1 :** పెండింగ్‌లో ఉన్న సర్పంచుల బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. కొత్త సర్పంచులకు నిధులను కేటాయించాలని విన్నవించారు. గురువారం అక్బర్‌పేట, భూంపల్లి మండలంలోని బొప్పాపూర్‌లో ఎంపీ రఘునందన్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఓపెన్ జిమ్, సోలార్ స్ట్రీట్ లైట్లను సర్పంచ్ మాధవనేని భానుప్రసాద్, పాలకవర్గంతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎంపీ రఘునందన్ రావు మీడియాతో మాట్లాడారు. మహాత్మాగాంధీ కళలు కన్నా గ్రామస్వరాజ్యం సాధించాలని పాలకవర్గానికి సూచించారు. తన పార్లమెంట్ పరిధిలో ఎప్పుడు, ఏ సమస్య వచ్చిన 24 గంటలు తాను అందుబాటులో ఉండి పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. వ్యక్తిగత రీత్యా కూడా గ్రామపంచాయతీల ఏర్పాటుకు కృషి చేస్తానని మాటిచ్చారు. బొప్పాపూర్ గ్రామ పంచాయతీ, ఐకేపీ సెంటర్లో లైట్లు, రోడ్ల నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటిపై సోలార్‌ను ఏర్పాటు చేసుకుని కరెంట్ ఆదా చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు ఎంపీ రఘునందన్ రావు. మూడున్నరేళ్లలో సోలార్ నుంచి కరెంట్ తయారీ చేసేలా చూడాలని నిర్దేశిరచారు. ఎనగుర్తి నుంచి శిలాజీ నగర్ వరకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద 'మన ఊరు – మన బడి' నిధుల్లేవని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సర్పంచులు పనిచేసిన బిల్లులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేసే ప్రతి పథకాన్ని ఇక్కడ కూడా అమలు చేసేలా పాలకవర్గం చర్యలు తీసుకోవాలని ఎంపీ రఘునందన్ రావు సూచించారు.

# బంగ్లాదేశ్‌లో హిందువులపై ఆగని దాడులు

## మతోన్మాదుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ మరో వ్యక్తి

**ఢాకా, జనవరి 1 :** బంగ్లాదేశ్‌లో హిందువులపై మారణకాండలు ఆగటం లేదు. కొంతమంది మతోన్మాదులు టార్గెట్ చేసి మరీ హిందువులపై దాడులు చేసి చంపేస్తున్నారు. నెలలో నలుగురు హిందువులపై దాడులు జరగటం అక్కడి హిందువులను తీవ్రంగా భయపెడుతోంది. డిసెంబర్ 16వ తేదీన ఓ బట్టల ఫ్యాక్టరీలో పని చేస్తున్న దీపు చంద్రదాస్ అనే యువకుడు మతోన్మాదుల దాడికి గురయ్యాడు. అతడితో పాటు పని చేస్తున్న వారే దారుణానికి ఒడిగట్టారు. కొట్టి చంపేసి, చెట్టుకు వేలాడదీసి కాల్చేశారు. దైవ దూషణకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఈ ఘోరం చేశారు. ఈ సంఘటన జరిగిన వారం రోజులకే రాజ్‌భరీలోని హోసయ్‌దంగ గ్రామానికి చెందిన 29 ఏళ్ల అమ్రిత్ మండల్ అలియాస్ సామ్రాట్ అనే యువకుడిని మతోన్మాదులు దారుణంగా కొట్టి చంపేశారు. దొంగతనాలకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ ఈ ఘోరానికి ఒడిగట్టారు. 29వ తేదీన సైల్‌హెట్ సదర్ కాదిర్‌పురకు చెందిన భజేంద్ర బిశ్వాస్ అనే 40 ఏళ్ల వ్యక్తి తనతో పాటు పని చేసే యువకుడి చేతిలో ప్రాణాలు కోల్పోయాడు. ఆ యువకుడు భజేంద్రను తుపాకితో కాల్చి చంపేశాడు. పొరపాటున తుపాకీ పేలటంతో ఈ దారుణం జరిగిందని పోలీసులకు చెప్పాడు. మూడు సంఘటనల నుంచి తేరుకోక ముందే మరో సంఘటన జరిగింది. డిసెంబర్ 31వ తేదీన ఖోకన్ దాస్ అనే హిందూ వ్యక్తి మతోన్మాదుల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. ఆస్పత్రి బెడ్‌పై ప్రాణాలతో పోరాడుతూ ఉన్నాడు. షరియాతుప్పూర్ జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. నిన్న రాత్రి ఖోకన్ దాస్ ఇంటికి వెళుతూ ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే ఓ గ్యాంగ్ అతడిపై కత్తులతో దాడి చేసింది. విచక్షణా రహితంగా పొడిచేసింది. తర్వాత అతడిపై గ్యాంగ్ సభ్యులు కిరోసిన్ పోసి నిప్పంటించారు. అక్కడినుంచి పారిపోయారు. స్థానికులు అతడ్ని గుర్తించి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.



# నంద్యాల జిల్లాలో దారుణ ఘటన

## ముగ్గురు బిడ్డలను కడతేర్చి తండ్రి ఆత్మహత్య

**నంద్యాల, జనవరి 1 :** కడుపున పుట్టిన పిల్లలను తల్లిదండ్రులు ఎంతో అపురూపంగా చూసుకుంటారు. అలాంటిది ఓ తండ్రి మాత్రం పిల్లల విషయంలో ఎంతో కర్కశంగా ప్రవర్తించాడు. తన రెక్కల కింద దాచుకోవాల్సిన చిన్నారులను తనే పొట్టనబెట్టుకున్నాడు. ఆపై అతడూ దారుణానికి పాల్పడ్డాడు. నంద్యాల జిల్లాలో జరిగిన ఈ ఘటన సంచలనంగా మారింది. నంద్యాల జిల్లా తొడుములదిన్నెలో దారుణం జరిగింది. కన్నబిడ్డలను అతి కిరాతకంగా చంపేశాడో తండ్రి. తన ముగ్గురు పిల్లలను కడతేర్చిన తండ్రి.. ఆపై తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చనిపోయిన ముగ్గురు చిన్నారులు కావ్య(7), ధ్యానేశ్వరి(4), గగన్(2)లుగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అసలు ముగ్గురు చిన్నారులను తండ్రి ఎందుకు చంపేశాడు ఇందుకు గల కారణాలు ఏంటి? కుటుంబ కలహాలు ఏమన్నా ఉన్నాయా? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.



# కొత్త ఏడాదిలోనూ ధరల పరుగులు

## స్వల్పంగా పెరిగిన బంగారం.. తగ్గిన వెండి

**హైదరాబాద్, జనవరి 1 :** కొత్త సంవత్సరం తొలి రోజునే బంగారం ధరల్లో పెరుగుదల కనిపించింది. గత మూడు రోజుల బేరిష్ ట్రెండ్‌కు బ్రేకులు చెబుతూ గురువారం పసిడి ధర స్వల్పంగా పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 11.00 గంటల సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర నిన్నటితో పోలిస్తే స్వల్పంగా పెరిగి రూ.1,35,060కు చేరుకుంది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర కూడా సుమారు రూ.150 మేర పెరిగి రూ.1,23,800కు చేరుకుంది. వెండి ధర మాత్రం మరింతగా తగ్గింది. కిలో వెండి రేటు నిన్నటితో పోలిస్తే సుమారు రూ.1000 మేర తగ్గి రూ.2,38,000కు చేరుకుంది. సుంకాల ప్రభావం, ఫెడ్ వడ్డీ రేటు కోతపై పెరుగుతున్న అంచనాలు, కేంద్ర బ్యాంకుల పసిడి కొనుగోళ్లు వంటివి బంగారానికి మళ్లీ డిమాండ్ పెంచుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అయితే, నేడు ట్రేడింగ్ ఓ మోస్తరుగా ఉండటంతో బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కూడా ఆ మేరకు పరిమితమయ్యే అవకాశం ఉందని అంటున్నారు. అయితే రోజులు గడిచే కొద్దీ మళ్లీ వీటి ధరలు మళ్లీ పెరగడం పక్కా అని చెబుతున్నారు.




# మనీలాండరింగ్ కేసులో ఈడీ దాడులు

- అండర్ అండర్ వరల్డ్ డాన్ ఇందర్జీత్ సింగ్ ఇంట్లో సోదాలు
- భారీగా లెక్క చూపని బంగారం, వజ్రాలు, నగదు పట్టివేత

**న్యూఢిల్లీ, జనవరి 1 :** మనీలాండరింగ్ కేసుకు సంబంధించి స్వర్వప్రియ విహార్ ప్రాంతంలో ఉన్న అండర్ వరల్డ్ డాన్ ఇందర్జీత్ సింగ్ యాదవ్, అతని అనుచరుల ఇండ్లపై ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో కళ్లు చెదిరేలా డబ్బులు, బంగారు నగలు బయటపడ్డాయి. లెక్కల్లో చూపించని రూ.5 కోట్ల నగదు, రూ.8 కోట్ల విలువైన బంగారు, వజ్రాలు ఉన్న సూట్‌కేసు,35 కోట్ల రూపాయల విలువైన ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు అధికారులు. ఈ మొత్తం కలిపి సుమారు రూ.48 కోట్ల రూపాయల వరకు ఉంటుందని ఈడీ తెలిపింది. ప్రస్తుతం అమన్ కుమార్, ఇందర్జీత్ సింగ్ పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. కొంత మంది రాజకీయ నాయకుల అండతో ఇందర్జీత్ ప్రైవేట్ ఫైనాన్షియర్లు, బిల్డర్లు, కాంట్రాక్టర్లను బెదిరిస్తూ డబ్బులు కూడబెట్టినట్లు సమాచారం. ఇందర్జీత్ సింగ్ జంఇ కేంద్రంగా కార్యాకలాపాలు కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సోదాల సందర్భంగా డబ్బును లెక్కించడానికి బ్యాంక్ అధికారులు కౌంటింగ్ మిషన్ తెప్పించినట్లు తెలుస్తుంది. సందర్జీత్ యాదవ్, అతని అనుచరులపై హర్యానా, యూపీ రాష్ట్రాల్లో 15 కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అక్రమ ఆయుధాలు కలిగి ఉన్నాడన్న కారణంగా ఆయుధాల చట్టంతో పాటు ఇతర కేసులు నమోదు చేసి, చార్జిషీట్లు కూడా దాఖలు చేశారు అధికారులు. ప్రస్తుతం ఈ డబ్బుల, నగలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన సర్పంచ్ నాగుల సత్యనారాయణ యాదవ్

**ఆత్మకూర్ (ఎం). రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం) మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన సర్పంచ్ నాగుల సత్యనారాయణ యాదవ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు ఇస్తామని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారం గ్రామాన్ని అభివృద్ధి చేస్తా అన్నారు ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు అదేవిధంగా ఈరోజు నుండి గ్రామంలో చెత్త సేకరణ కొరకు ట్రాక్టర్ ను కూడా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మెట్టు లలిత భాస్కర్ రెడ్డి వార్డు మెంబర్లు మరియు మాజీ సర్పంచ్ మెట్టు లక్ష్మీ ఎల్లారెడ్డి,నాయకులు ఎడమ మోహన్ రెడ్డి కడకంచి రామ నరసయ్య జక్కు మల్లారెడ్డి నాగుల జనార్ధన్ యాదవ్ మెట్టు శేఖర్ రెడ్డి ఏల్ల బోయిన రమేష్ నాగుల దేవేందర్ ఇందిరాల రేణుక రాములు మక్తాల మంగమ్మ ఐలయ్య ఇంద్రాల అంజయ్య మంచోజు అమరేంద్ర చారి కడకంచి కుమార్ మక్తాల నరసింహ ఎల్లబోయిన క్రిష్ణా తెల్లబోయిన రాజయ్య వి బి కే మక్తాల విజయలక్ష్మి సమ భావన సంఘాల సభ్యులు మరియు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## ఇంటర్నెట్ సర్వీస్‌తో అరచేతిలోనే ప్రపంచం

- మాజీ సర్పంచ్ కుమార్ గౌడ్
- ఇంటర్నెట్ సర్వీసుల 2026 క్యాలెండర్ ఆవిష్కరణ.

**పతాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** ప్రపంచంలో జరిగే అన్ని విషయాలు ఇప్పుడు అరచేతిలోకి తెచ్చిన రకరకాల ఇంటర్ నెట్ లు ఈ భూమి పై ప్రతి చోటుకు వెళ్ళింది. ఈ ఇంటర్నెట్ సేవలు చేస్తున్న వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన తెల్లాపూర్ మాజీ సర్పంచ్ కుమార్ గౌడ్ 263 వ డివిజన్ తెల్లాపూర్ లో జాయ్ కమ్యూనికేషన్స్ కేబుల్ ఇంటర్నెట్ సర్వీసెస్ సంస్థ యొక్క 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ క్రిస్టోఫర్ మాజీ పంచాయతీ ఈవో కోటిలింగం మాజీ ఉపసర్పంచ్ కృష్ణ మాజీ సింగిల్ విండో నాయ కుడు బాల్ రాజ్ గౌడ్ ఆస్క్ చైర్మన్ సత్తయ్య నాయకులు నరసింహారెడ్డి రవి గౌడ్ మాజీ సాగునీటి సంఘం చైర్మన్ వడ్డే నర్సింలు మాణిక్ రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.



## ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన సర్పంచ్ తండ మంజుల నరసింహ గౌడ్

**ఆత్మకూర్(ఎం). రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం) మండలం పల్లెర్లగ్రామంలో మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన సర్పంచ్ తండ మంజుల నరసింహ గౌడ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు ఇస్తామని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారం గ్రామాన్ని అభివృద్ధి చేస్తా అన్నారు ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు ఉప సర్పంచ్ కానుకుంట్ల సారయ్య వార్డు మెంబర్స్. సామ నరేందర్ రెడ్డి. లోడి మణికాంత్. పొడుగు భార్గవి. సంఘపాక రజిత రాజు అంబోజు రాములు.ఎడ్ల జ్యోతి మచ్చ గిరి. ఏలూరి సుదర్శన్. అంబోజు కృష్ణ జ్యోతి. కచర వేణి లింగస్వామి. మమత. లోడీ సుభద్ర ఫీల్డ్అసిస్టెంట్ మేడి రామ లక్ష్మయ్య. కొమ్ము సుచరిత. నోముల స్వామి. ఎడ్ల లావణ్య.మేడి నవనిత. లోడి అనసూర్య.వస్తుపుల రేణుక. దుర్గ పతి సరిత.కొమ్ము అనిత. గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

**వాజేడు, రాజముద్ర న్యూస్:** మండల కేంద్రంలో పేరూరు పంచాయతీ పరిధి చిన్న గొల్లగూడెంలో గురువారం నూతన సంవత్సర వేడుకలో భాగంగా అభయాంజనేయ స్వామి విగ్రహానికి శుద్ధిచేసి,పాలభిషేకం చేశారు. రామాలయం అర్చకులు రవీంద్రచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అందరూ ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని, పూలు, పండ్లు, కొబ్బరికాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కుంట నరసింహారావు,బొల్లె సంతోష్, కత్తెర వసంత్, ఎర్రావుల యశ్వంత్, గంగిన బోయిన అజిత్,పానేం సారబాబు తదితరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించిన డిసిఓ

**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని గురువారం రోజున జిల్లా వ్యవసాయ అధికారి డి సి ఓ పరిశీలించి ఎరువుల సెల్ రిజిస్టర్స్, స్టాక్ బోర్డ్స్ తప్పనిసరిగా పెట్టాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఏవో భాను శ్రీ,, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### సీఎం ఎ.రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** జర్నలిస్టుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని, తన పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలను తన దృష్టికి తెస్తే తప్పకుండా వాటిని పరిష్కరిస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం నాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ప్రతినిధి బృందం సచివాలయంలో సీఎం ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. అలాగే యూనియన్ రూపొందించిన 2026 మీడియా డైరీని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరింపజేసింది. ఈ సందర్భంలో జర్నలిస్టులకు నూతన సంవత్సర కానుకగా సంక్షేమ పథకాలు అందించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ





ముఖ్యమంత్రిని కోరగా, ఆయన పై విధంగా స్పందించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఐజేయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, ఐజేయు కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్లూరి రాములు, కార్యదర్శులు వి.యాదగిరి, కె. శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి యం. వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. కిరణ్ కుమార్, అజిత, చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి, ఉర్దూ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్ మోహియుద్దీన్, వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరీష్ లు ఉన్నారు. అనంతరం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని యూనియన్ ప్రతినిధి బృందం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది.

**సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన శ్రీనివాస్ రెడ్డి:**

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి గురువారం నాడు సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు

- ఇన్సిడెంట్ ఫ్రీ -యాక్సిడెంట్ ఫ్రీ న్యూ ఇయర్
- 140 మద్యం మత్తు డ్రైవింగ్ కేసులు, 496 జరిమానా కేసులు నమోదు

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 2026 నూతన సంవత్సర వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఇన్సిడెంట్ ఫ్రీ యాక్సిడెంట్ ఫ్రీ గా ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా పోలీసుల ముందస్తు పకడ్బందీ ప్రణాళికలు, నిరంతర నిఘా, క్షేత్రస్థాయి సమన్వయంతో అమలు చేసిన భద్రతా చర్యల ఫలితంగా నూతన సవత్సర వేడుకలు సజావుగా సాగాయి.డిసెంబర్ 31 న్యూ ఇయర్ సందర్భంగా జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్ తన కార్యాలయం నుండి అత్యున్నత స్థాయిలో నేరుగా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులకు ఎప్పటికప్పుడు తగు ఆదేశాలు జారీ చేశారు.సూర్యాపేట డివిజన్ డిఎస్పీ ప్రసన్న కుమార్,కోదాడ డివిజన్ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ లు క్షేత్రస్థాయిలోనే ఉండి విధులు నిర్వర్తించారు. వాహనాలు సజావుగా సాగడం, నిబంధనల కట్టుదిట్టమైన అమలు,ప్రజలు సురక్షితంగా వేడుకలు జరుపుకునేలా విస్తృత చర్యలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అనుకోని సంఘటనలు జరగకుండా నివారించేందుకు 2025 డిసెంబర్ 31 రాత్రి నుంచి 2026 జనవరి 1 ఉదయం వరకు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రత్యేక డ్రైవ్‌లో మద్యం మత్తులో వాహనాలు నడిపిన 140 మందిని గుర్తించి వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేయడం జరిగినది.ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న 496 వాహనాలపై జరిమానా కేసులు నమోదు చేయడం జరిగింది. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా జిల్లా పోలీసుల విస్తృత ప్రణాళికలు కారణంగా ఎక్కడా రోడ్డు ప్రమాదాలు, గొడవలు జరగలేదని ఎస్పి నరసింహ ఐపిఎస్ వెల్లడించారు. ప్రజా భద్రతా దృష్ట్యా రోడ్లపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రమాదకరమైన చర్యలకు దూరంగా ఉండాలని ఎస్పి విజ్ఞప్తి చేశారు.

## మహాలింగాపురం సర్పంచ్ రాఘవేందర్ రెడ్డి దాతృత్వం

### ఇల్లులేని నిరుపేద మహిళకు ఇల్లు నిర్మాణం

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** మహాలింగాపురం గ్రామ నూతనంగా ఎన్నికైన సర్పంచ్ మాచన్నగారి రాఘవేందర్ రెడ్డి తన మానవత్వం, సేవాభావానికి మరోసారి నిదర్శనంగా నిలిచారు. గ్రామానికి చెందిన కోనాపురం వెంకటమ్మ గత పదేళ్లకు పైగా స్వంత నివాసం లేకుండా నిరాశ్రయ స్థితిలో జీవనం సాగిస్తున్నారు. ఆమె నిస్సహాయ స్థితిని గమనించిన సర్పంచ్ రాఘవేందర్ రెడ్డి ఆమెకు స్వంత గృహం ఉండాలనే ఉద్దేశంతో తన వ్యక్తిగత చొరవతో కొత్త ఇల్లు నిర్మించాలని నిర్ణయించారు. ఆ సంకల్పానికి అనుగుణంగా నిర్మాణ పనులు పూర్తి చేసి, నేడు ఆ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, పెద్దలు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఆశీస్సులు అందజేశారు. నిరాశ్రయురాలైన వెంకటమ్మకు స్వంత నివాసం కల్పించిన ఈ సేవా కార్యక్రమం అందరి హృదయాలను తాకింది. సామాజిక బాధ్యతతో, ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న నూతన



సర్పంచ్ మాచ్చన్నగారి రాఘవేందర్ రెడ్డి ఈ మంచి కార్యానికి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రశంసల వర్షం కురిపించారు. గ్రామ ప్రజల కష్టాలను అర్థం చేసుకుని, ఆ సమస్యలకు పరిష్కారం చూపుతున్న ఆయన సేవా దృక్పథం భవిష్యత్తులో మరెన్నో మంచి పనులకు దారి తీస్తుందని గ్రామ పెద్దలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## మలక్‌పేట్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొని భార్యాభర్తలు మృతి

**హైదరాబాద్:** ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న భార్యా భర్తలు అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన మలక్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధి వాహేద్ నగర్ ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. సూర్యాపేట జిల్లాకు చెందిన తిరుపతి రావు, వెంకటమ్మ దంపతులు ఇటీవల దిల్‌సుఖ్‌నగర్‌లోని కొత్తపేటలో ఉంటున్న తమ కుమార్తె వద్దకు వచ్చారు. ఈక్రమంలో గురువారం సాయంత్రం ద్విచక్రవాహనంపై వారిద్దరూ ట్యాంక్‌బండ్ చూసేందుకు బయలుదేరారు. మూసారాంబాగ్ హైటెక్ మోటార్స్ సమీపంలో, వెనుక నుంచి వేగంగా వచ్చిన దిల్‌సుఖ్‌నగర్ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో దంపతులు రోడ్డుపై పడిపోయారు. బస్సు వెనుక టైరు వారిపై నుంచి వెళ్లడంతో తిరుపతిరావు, వెంకటమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న మలక్‌పేట్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### భారతి నగర్ డివిజన్‌లో న్యూ ఎంఐజిని కలపడం

# తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

### మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి

**పతాన్ చెరువు, రాజముద్ర :** హైదరాబాద్ మహా నగర పాలక డి లిమిటేషన్ లో భాగంగా 263వ డివిజన్ కు ఆనుకొని ఉన్న న్యూఎమ్ ఐజిని 269 భారతి నగర్ డివిజన్ లో కలపడం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం అని తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డితో పాటు, ఎంఐజి కాలనీవాసులు వ్యతిరేకిస్తున్నారు. అభ్యంతరాలు తెలుపుతున్నారు. గురువారం రోజు విలేకరుల సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడుతూ, 263 డివిజన్ కు ఆనుకొని ఉన్న కాలనీలు గ్రామాలు న్యూ ఎంఐజిని భారతి నగర్ లో కలపడం, వెలిమెల గ్రామాన్ని ముత్తంగి డివిజన్లో కలపడం మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఈ సందర్భంగా సోమిరెడ్డి తెలిపారు. రెండు రోజులలో కార్యాచరణను ప్రకటిస్తామని, ఈ న్యూఎంఐజి ముత్తంగి గ్రామాల విలీనాల పై తప్పకుండా నిరసనలు తెలియజేస్తూ, అవసరమైతే



నిరాహార దీక్షలు సైతం చేసి, న్యూ ఎంఐజిని ముత్తంగి గ్రామాలను 263 వ డివిజన్ లో కలిపే విధంగా ప్రభుత్వంతో కొట్లాడుతామని, తెలియజేస్తూ స్థానిక కాంగ్రెస్ నాయకులు ఈ విషయంపై నోరు మెదపకపోవడం పట్ల సోమిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 263 డివిజన్ నాయకులతోపాటు న్యూఎంఐజీ కాలనీవాసులు పాల్గొన్నారు.



## ఘనంగా అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

**వాజేడు, రాజముద్ర న్యూస్:** మండల కేంద్రంలో పేరూరు పంచాయతీ పరిధి చిన్న గొల్లగూడెంలో గురువారం నూతన సంవత్సర వేడుకలో భాగంగా అభయాంజనేయ స్వామి విగ్రహానికి శుద్ధిచేసి,పాలభిషేకం చేశారు. రామాలయం అర్చకులు రవీంద్రచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అందరూ ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని, పూలు, పండ్లు, కొబ్బరికాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కుంట నరసింహారావు,బొల్లె సంతోష్, కత్తెర వసంత్, ఎర్రావుల యశ్వంత్, గంగిన బోయిన అజిత్,పానేం సారబాబు తదితరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించిన డిసిఓ

**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని గురువారం రోజున జిల్లా వ్యవసాయ అధికారి డి సి ఓ పరిశీలించి ఎరువుల సెల్ రిజిస్టర్స్, స్టాక్ బోర్డ్స్ తప్పనిసరిగా పెట్టాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఏవో భాను శ్రీ,, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## స్పార్క్ హాస్పిటల్ 2026 క్యాలెండర్ విడుదల

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** ఉప్పల్ డీపో సమీపంలోని స్పార్క్ హాస్పిటల్ యాజమాన్యం, నూతన సంవత్సర సందర్భంగా 2026 సంవత్సర క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించింది. ఈ క్యాలెండర్‌లో హాస్పిటల్ సేవలు, ఆరోగ్య చిట్కాలు ఉన్నాయి. హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వై. మహేశ్ రెడ్డి మాట్లాడుతూ, "2026లో అందరూ ఆకాంక్షించినట్లు, అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాము" అని శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ ఆర్. శ్రీను, డైరెక్టర్లు ఎమ్. రామ్ రెడ్డి, డాక్టర్ బి. శ్రీనివాస్, డాక్టర్ ఎమ్. రాఘునందన్ రెడ్డి, డాక్టర్ జె. రవి, డాక్టర్ ఎస్. ఊమా మహేశ్వరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర సెక్రటరియేట్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు తుంగతుర్తి రవి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలవ్వాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు.



## న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ ప్రమాణస్వీకారం

**న్యూయార్క్ :** న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ మమ్దానీ ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం అర్ధరాత్రి (అమెరికా కాలమానం ప్రకారం) మాన్‌హట్టాన్‌లోని ఓ చారిత్రక సబ్‌వే స్టేషన్‌లో ఈ కార్యక్రమం జరగడం గమనార్హం. ఖురాన్‌పై ప్రమాణం చేసి.. న్యూయార్క్‌లో తొలి ముస్లిం మేయర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇది తనకు దక్కిన గొప్ప గౌరవమని, ఎంతో ప్రత్యేకమైనదని మమ్దానీ పేర్కొన్నారు. డెమోక్రటిక్ అయిన జోహ్రాన్ ప్రమాణ-స్వీకార కార్యక్రమాన్ని.. ఆయన రాజకీయ స్నేహితురాలు, న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిటియా జేమ్స్ నిర్వహించారు. ప్రమాణ స్వీకారం అనంతరం మమ్దానీ మాట్లాడుతూ.. నగరానికి కొత్త రవాణా కమిష నర్‌గా మైక్ ఫ్లిన్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. న్యూయార్క్ నగర వారసత్వానికి, ప్రజారవాణాలో ఓల్డ్ సబ్‌వే స్టేషన్ ఎంతో కీలకంగా ఉందని అభివర్ణించారు. ఇక, మధ్యాహ్నం 1 గంటకు (అమెరికా కాలమానం ప్రకారం) ఆయన మ-రోసారి ప్రమాణస్వీకారం చేయనున్నారు. సిటీహాల్‌లో జరిగే బహిరంగ కార్యక్రమంలో యూఎస్ సెనేటర్ బెర్నీ సాండర్స్ చేతులమీదుగా ప్రమాణస్వీకారం జరగనుంది.





## కొత్త సంవత్సరం వేళ స్విట్జర్లాండ్‌లో భారీ పేలుడు.. 40 మంది మృతి

**స్విట్జర్లాండ్ :** నూతన సంవత్సరం వేళ స్విట్జర్లాండ్‌లో పెను విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ స్కీ రిసార్ట్ నగరం క్రాన్స్ మోంటానాలో గల ఓ బార్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 40 మంది మ ృతిచెందినట్లు తెలుస్తోంది. ఈ మేరకు స్థానిక అధికారిక వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మరో 100 మందికి పైగా గాయపడినట్లు తెలిపాయి. మ ృతుల సంఖ్యపై అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. బార్‌లో నూతన సంవత్సర వేడుకలు జరుగుతుండగా అర్ధరాత్రి 1.30 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) ఈ పేలుడు చోటుచేసుకుంది. పేలుడు ధాటికి భారీగా మంటలు చెలరేగాయి. సమాచారమందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఈ ఘటనలో ఉగ్ర కుట్ర లేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. బాణసంచా కారణంగా ఈ పేలుడు సంభవించి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. స్విస్ ఆల్ప్స్ పర్వతశ్రేణుల నడుమ ఉన్న ఈ క్రాన్స్ మోంటానా నగరం ప్రముఖ పర్యాటక స్థలం. ఏటా డిసెంబరు-జనవరి సమయంలో ఇక్కడ పర్యాటకుల తాకిడి విపరీతంగా ఉంటుంది. గత కొంతకాలంగా ఇక్కడ కార్చిచ్చులు చోటుచేసుకుంటున్నట్లు సమాచారం.



## కండోమ్స్‌పై 13 శాతం పన్ను

### నూతన సంవత్సరం నుంచి చైనాలో అమల్లోకి..

**చైనా :** జనాభా సంక్షోభాన్ని ఎదుర్కొంటోన్న చైనా జననాల రేటును పెంచేందుకు ఎన్నో అవస్థలు పడుతోంది. ఇందులోభాగంగా కండోమ్ సహా గర్భనిరోధక సాధనాలు, ఔషధాలపై 13 శాతం పన్ను విధించింది. కొత్త సంవత్సరం (జనవరి 1 నుంచి) వేళ ఈ నిర్ణయం అమల్లోకి వచ్చింది. వృద్ధ జనాభా పెరిగిపోతుండటం, ఆర్థిక వ్యవస్థ మందగమనంలో కొనసాగుతుండటం వంటి పరిస్థితుల్లో యువత పెళ్లి చేసుకొని, పిల్లల్ని కనేలా చైనా ప్రభుత్వం ప్రోత్సాహకాలను ప్రకటిస్తోంది. ఈ క్రమంలో గర్భనిరోధక సాధనాలు సహా పలు వస్తువులపై 13 శాతం పన్ను విధిస్తూ విలువ ఆధారిత పన్ను చట్టాన్ని ఇప్పటికే సవరించింది. డ్రాగన్ కొన్ని దశాబ్దాల పాటు కుటుంబ నియంత్రణను కఠినంగా అమలుచేసింది. దాంతో ఈ ఉత్పత్తులపై 1993 నుంచి పన్ను మినహాయింపు కొనసాగింది. ఇటీవల దానిని ఎత్తివేసిన ప్రభుత్వం.. తాజాగా కొత్త పన్నును అమల్లోకి తీసుకువచ్చింది. ఇప్పటికే పిల్లల సంరక్షణ సేవలు (నర్సరీ నుంచి కిండర్‌గార్టెన్స్ వరకు), వృద్ధుల సంరక్షణ, వికలాంగుల సేవలు, వివాహ సంబంధిత సేవలపై పన్ను మినహాయింపును ప్రకటించిన సంగతి తెలిసిందే. అదీ నేటినుంచే అమల్లోకి వచ్చింది. పిల్లల పెంపకంలో అత్యంత ఖరీదైన దేశాల్లో చైనా ఒకటి. 18 ఏళ్ల వరకు పెంచేందుకు సరాసరి 76వేల డాలర్లు (రూ.68లక్షలు) ఖర్చు అవుతున్నట్లు అంచనా. దీంతో అనేకమంది చైనా దంపతులు పిల్లల్ని కనేందుకు వెనకాడుతున్నారు. యువతలో ఈ వైఖరిని తగ్గించేందుకు ఈ చర్యలన్నీ తీసుకుంటుంది. కాగా.. చైనా సీడీసీ ప్రకారం గత ఇరవై ఏళ్లతో పోలిస్తే ఇటీవల స్థానికంగా ఎయిడ్స్ కేసుల సంఖ్య పెరిగింది. ఇలాంటి తరుణంలో కండోమ్‌ల ధరలు పెంచడం ప్రతికూల ఫలితాలకు దారితీస్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

# వందేభారత్ స్లీపర్ వేగం గంటకు 180కి.మీ.



**న్యూఢిల్లీ :** దేశీయంగా రూపొందించిన వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కి.మీ. గరిష' వేగాన్ని సాధించగలిగింది. రైల్వే భద్రత కమిషనర్ (సీఆర్ఎస్) సమక్షంలో దీనికి సంబంధించిన తుది పరీక్షలను బుధవారం నిర్వహించారు. కోటా (రాజస్థాన్) నుంచి నాగ్దా (మధ్యప్రదేశ్) మధ్య ఈ వేగాన్ని చేరుకోవడం ద్వారా మరో మైలురాయిని అధిగమించినట్లయిందని రైల్వే మంత్రిత్వశాఖ పేర్కొంది. గాజుగ్లాసుల్లో నీళ్లు నింపి ఒకదానిపై ఒకటిగా ఈ రైలింజిన్లో ఉంచినా.. గరిష' వేగాన్ని చేరుకున్నప్పుడు కూడా ఏమాత్రం తొణక్కపోవడాన్ని వీడియో తీశారు. దీనిని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. రైలు గమనంలో స్థిరత్వం, కుదుపులు, ప్రకంపనలు, బ్రేకుల పనితీరు, భద్రత ప్రమాణాలు వంటివన్నీ పరీక్షించారు. రైలు పనితీరు సంతృప్తికరంగా ఉందని, ప్రయోగపరీక్ష విజయవంతమైనట్లు సీఆర్ఎస్ ప్రకటించారని రైల్వేశాఖ తెలిపింది. రైల్లో 16 పెట్టెలు ఉన్నాయి. వీటిలో ఆకర్షణీయమైన (ఏసీ) స్లీపర్ బెర్తులు, అధునాతన సస్పెన్షన్ వ్యవస్థ, ఆధునిక మరుగుదొడ్లు, నిప్పును గుర్తించే వ్యవస్థలు, సీసీటీవీ నిఘా వంటివి ఉంటాయి. ప్రయాణికులు ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఈ రైళ్లను ఎప్పటినుంచి ప్రవేశపెట్టబోయేదీ ప్రకటించలేదు. సీఆర్ఎస్ అనుమతితో దీనికి మార్గం సుగమం అయిందని మాత్రం రైల్వేశాఖ పేర్కొంది.

## తొలి వందే భారత్ స్లీపర్ రైలు ఈ రూట్‌లోనే..



సుదూర ప్రయాణాలు చేసే రైలు ప్రయాణికులకు శుభవార్త. త్వరలోనే వందేభారత్ స్లీపర్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. దీనికి సంబంధించి రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం కీలక ప్రకటన చేశారు. తొలి రైలు కోల్‌కతా- గువాహటిల మధ్య అందుబాటులోకి రానుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా త్వరలో ప్రారంభం కానుందని చెప్పారు. పశ్చిమబెంగాల్-అస్సాం మధ్య నడిచే ఈ రైల్లోని టికెట్ ధరలు.. విమాన టికెట్ ధరల కంటే తక్కువే ఉంటాయని చెప్పారు. ఈ మే-రకు ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే 15-20 రోజుల్లో ఈ రైలు అందుబాటులోకి రానుందని అశ్విని వైష్ణవ్ చెప్పారు. జనవరి 18-19 తేదీల్లో ఈ ప్రారంభోత్సవం ఉండొచ్చని పేర్కొన్నారు. రైలు ప్రారంభోత్సవం గురించి ప్రధాని మోదీకి తెలియజేశామని చెప్పారు. రాబోయే 2-3 రోజుల్లో ప్రారంభోత్సవ తేదీ వివరాలను ప్రకటిస్తానని తెలిపారు. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య విమాన ప్రయాణానికి రూ.6 వేలు నుంచి 8 వేలు ఖర్చవుతోందని వైష్ణవ్ అన్నారు. వందేభారత్ స్లీపర్‌లో 3 ఏసీలో టికెట్ ధర (ఆహారంతో కలిపి) సుమారు రూ.2,300, 2ఏసీ ధర సుమారు రూ.3 వేలు, 1ఏసీ ధర సుమారు రూ.3,600 ఉండొచ్చని తెలిపారు. మధ్యతర గతిని దృష్టిలోపెట్టుకొని టికెట్ ధరలు నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ఏడాదిలో అస్సాం, పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు జరగనున్నాయి. మరోవైపు వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కి.మీ. గరిష' వేగాన్ని సాధించగలిగింది. రైల్వే భద్రత కమిషనర్ (సీఆర్ఎస్) సమక్షంలో కోటా (రాజస్థాన్) నుంచి నాగ్దా (మధ్యప్రదేశ్) మధ్య తుది పరీక్షలను నిర్వహించగా ఈ వేగాన్ని చేరుకుంది. గాజు గ్లాసుల్లో నీళ్లు నింపి ఒకదానిపై ఒకటిగా ఈ రైలింజిన్లో ఉంచినా.. గరిష' వేగాన్ని చేరుకున్నప్పుడు కూడా ఏమాత్రం తొణకకపోవడాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ రైల్లో 16 పెట్టెలు ఉన్నాయి. వీటిలో ఆకర్షణీయమైన (ఏసీ) స్లీపర్ బెర్తులు, అధునాతన సస్పెన్షన్ వ్యవస్థ, ఆధునిక మరుగుదొడ్లు, నిప్పును గుర్తించే వ్యవస్థలు, సీసీటీవీ నిఘా వంటివి ఉంటాయి.

## హెచ్-1బీ వీసాల ఆలస్యం..

### భారత ఉద్యోగులకు అమెజాన్ ఊరట




**యూఎస్ :** హెచ్-1బీ వీసా అపాయింట్‌మెంట్ కోసం వేచి చూస్తూ భారత్‌లో ఉండిపోయిన తమ ఉద్యోగులకు ఆమెజాన్ ఊరట కలిగించే విషయం చెప్పింది. ఐదు రోజుల ఆఫీసు నిబంధనను సడలించి, మార్చి వరకు రిమోట్‌గా పనిచేసేందుకు వెసులుబాటు కలిగించింది. ఇందుకు కొన్ని షరతులు విధించినట్లు సమాచారం. ఈ మేరకు సంబంధిత ఉద్యోగులకు అడ్వైజరీ పంపినట్టు తెలిసింది. హెచ్-1బీపై అమెరికాలో పనిచేస్తూ వివిధ కారణాలతో భారత్ వచ్చిన అమెజాన్ ఉద్యోగులు.. వీసా అపాయింట్‌మెంట్‌లో జాప్యం కారణంగా ఇక్కడే ఉండిపోయారు. ఇలా డిసెంబర్ 13 నాటికి భారత్‌కు వచ్చి, రీషెడ్యూల్ వీసా అపాయింట్‌మెంట్ కోసం వేచిచూస్తున్న ఉద్యోగులకు ఈ ఏడాది మార్చి 2 వరకు ఇంటి నుంచే పని చేసుకునేందుకు అమెజాన్ అనుమతి ఇచ్చింది. ఈ సమయంలో కోడింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, సంబంధిత వ్యవహారాల్లో కీలక నిర్ణయాలు తీసుకోవడం లేదా కస్టమర్లతో మాట్లాడటం వంటివి చేయకూడదని స్పష్టంగా పేర్కొన్నట్లు సమాచారం. వీటితోపాటు భారత్‌లో ఉన్న ఆమెజాన్ కార్యాలయాలకు వెళ్లకూడదని ఆదేశించింది. అన్ని సమీక్షలు, తుది నిర్ణయాలు, ఇతర షెడ్యూల్‌లన్నీ భారత్ వెలుపలే ఉండాలని స్పష్టం చేసింది. హెచ్-1బీ వీసా అపాయింట్‌మెంట్‌లో జాప్యం కారణంగా అమెజాన్‌తో పాటు గూగుల్, యాపిల్, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు సమస్యను ఎదుర్కొంటున్నాయి. వీసా రీ-ఎంట్రీ ప్రక్రియకు నెలల సమయం పట్టే అవకాశం ఉందని, అందుకే అమెరికాను వీడి బయటకు వెళ్లొద్దని గూగుల్

## భగ్గుమంటున్న ఇరాన్



**టెహ్రాన్:** పెరిగిన ధరలు, పడిపోయిన కరెన్సీ విలువతో ఇరాన్ భగ్గుమంటోంది. తొలుత టెహ్రాన్‌లో ప్రారంభమైన నిరసనలు దేశమంతటా విస్తరించాయి. ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో సెంట్రల్ బ్యాంకు గవర్నర్ రాజీనామా చేసినా ప్రజలు శాంతించలేదు. కరెన్సీ రియాల్ విలువ పడిపోవడం, దారుణ పరిస్థితులను నిరసిస్తూ టెహ్రాన్‌లో వ్యాపారులు వీధుల్లోకి వచ్చి ఆందోళనల్లో పాల్గొంటున్నారు. దేశంలోని పలు నగరాలు, పట్టణాల్లో 3 రోజులుగా నిరసనలు కొనసాగుతున్నాయి. అమెరికా డాలరుతో పోలిస్తే రియాల్ విలువ దారుణంగా పడిపోవడం తో ఆదివారం టెహ్రాన్‌లోని గ్రాండ్ బజార్‌లో ఉన్న వ్యాపారు లు నిరసనకు దిగారు. అప్పటి నుంచి ఆందోళనలు కొనసా గుతున్నాయి. అవి కరాజ్, హమేదాన్, ఖేష్మ్, మలార్డ్, ఇస్ఫహాన్, కెర్మాన్‌షా, షిరాజ్, యాజ్డ్‌లకు విస్తరించాయి. పలుచోట్ల ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించిన ద ృశ్యాలు సామాజిక మాధ్య మాల్లో ప్రసారమయ్యాయి. ప్రభుత్వం ఆందోళనకారులను చర్చలకు పిలిచినా పెద్దగా ప్రయోజనం లేకపోయింది. 10 విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఆందోళనల్లో పాల్గొంటున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. నియంతలకు మరణ శిక్ష విధించాలని డిమాండు చేస్తున్నారు.

### సెంట్రల్ బ్యాంకుకు కొత్త గవర్నర్

దేశంలో ఆందోళనల నేపథ్యంలో రాజీనామా చేసిన సెంట్రల్ బ్యాంకు గవర్నర్ మహమ్మద్ రెజా ఫర్జీన్ స్థానంలో ఆర్థిక శాఖ మాజీ మంత్రి అబ్దుల్ నాజర్ హెమ్మతిని ప్రభుత్వం నియమించింది. అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ నేతృత్వంలోని క్యాబినెట్ ఆయన నియామకానికి ఆమోద ముద్ర వేసింది. వాస్తవానికి ఆర్థిక మంత్రిగా ఉన్న 68ఏళ్ల హెమ్మతిని 2024 మార్చిలో పార్లమెంటు తొలగించింది. పాలనా వైఫల్యంతో పాటు ఆయన అమలు చేసిన విధానాలు రియాల్‌కు వ్యతిరేకంగా ఉన్నాయని అప్పట్లో తీవ్ర విమర్శలొచ్చాయి.



## పుతిన్‌కు షాకిచ్చిన అమెరికా..

### ఉక్రెయిన్ డ్రోన్ దాడి చేయలేదంటూ కథనం

**యూఎస్ :** రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు అమెరికా షాకిచ్చింది. పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడికి యత్నించినట్లు రష్యా ఆరోపించిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్ దాడికి యత్నించినట్లు ఎలాంటి ఆధా రాలు లేవని యూఎస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ వెల్లడిం చింది. ఈ మేరకు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనాన్ని ప్రచురించింది. పుతిన్ వ్యక్తిగత నివాసం ఉన్న ప్రాంతంలోని సైనిక లక్ష్యాలపై దాడి చేయాలని ఉక్రెయిన్ యోచిస్తోందని, అవి ఆయన ఇంటికి అత్యంత సమీపంలో ఏమీ లేవని అమెరికా అధికారి వెల్లడించినట్లు ఆ కథనం పేర్కొంది. నోవ్‌గొరొడ్ ప్రాంతంలో పుతిన్ వ్యక్తిగత నివాసంపై ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున డ్రోన్లతో దాడికి ఉక్రెయిన్ ప్రయత్నించిందని రష్యా వెల్లడించింది. దీనిని ఉగ్రదాడిగా పేర్కొంది. ఉక్రెయిన్ ప్రయోగించిన డ్రోన్లను అన్నింటినీ నిర్వీర్యం చేశామని, నివాసానికి ఎటువంటి నష్టం కలగలేదని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ మేరకు వీడియో ద ృశ్యాలను విడుదల చేసింది. అయితే ఈ వ్యాఖ్యలను ఉక్రెయిన్ ఖండించింది. ఇదంతా అవాస్తవమని పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే ఆ దాడిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఖండించడం గమనార్హం. ఆ ఘటన గురించి పుతిన్ తనతో మాట్లాడినట్లు, ఇలాంటి ఘటనలను తాను ఉపేక్షించబోనని కూడా పేర్కొన్నారు.




## విమానం ఎక్కుతుండగా మద్యం వాసన

### అదుపులోకి ఎయిరిండియా పైలట్

**న్యూఢిల్లీ :** విమానం ఎక్కుతుండగా మద్యం వాసన రావడంతో ఎయిరిండియా పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. కెనడాలోని వాంకోవర్ ఎయిర్‌పోర్ట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. పైలట్ నుంచి మద్యం వాసన వస్తుందని గమనించిన విమానాశ్రయ సిబ్బంది ఒకరు కెనడా అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే అతనికి బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయగా.. అందులో విఫలమయ్యాడు. దాంతో వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ పైలట్ వాంకోవర్ నుంచి దిల్లీకి వెళ్లాల్సిన విమానాన్ని నడపాల్సి ఉంది. ఈ ఘటనతో అదికాస్త ఆలస్యమైంది. డిసెంబర్ 23న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా.. దీనిపై దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియా స్పందించింది. విధి నిర్వహణకు తగిన అర్హతపై ఆందోళన వ్యక్తం చేసిన కెనడా అధికారులు తర్వాత తమ పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారని పేర్కొంది. భద్రతా ప్రొటోకాల్స్‌ను పరిగణనలోకి తీసుకొని వేరే పైలట్‌కు బాధ్యతలు అప్పగించామని తెలిపింది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, స్థానిక అధికారులతో టచ్‌లో ఉన్నామని చెప్పారు. నిబంధనల ఉల్లంఘనను ఎట్టి పరిస్థితుల్లోను సహించబోమని స్పష్టం చేసింది.



## బీఎండబ్ల్యూ కార్ల టెండర్‌ను రద్దు చేసిన లోక్‌పాల్

**న్యూఢిల్లీ :** అవినీతి నిరోధక అంబుడ్స్‌మెన్ లోక్‌పాల్ ఒక్కొక్కటి రూ.70 లక్షల విలువైన ఏడు బీఎండబ్ల్యూ కార్ల కొనుగోలుకు టెండర్ ఆహ్వానించడంపై విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. దీంతో అంబుడ్స్‌మెన్ వెనక్కి తగ్గింది. ఆ కార్ల టెండర్‌ను రద్దు చేసింది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. లోక్‌పాల్ ఛైర్మన్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఖాన్విల్కర్ సహా ఏడుగురు జ్యుడీషియల్, నాన్-జ్యుడీషియల్ సభ్యుల కోసం కొన్నినెలల క్రితం కార్ల టెండర్‌ను లోక్‌పాల్ ఆహ్వానించింది. ఎంపికైన విక్రయదారు బీఎండబ్ల్యూ కార్లను నడిపే విధానంపై ఏడు రోజులు తమ డ్రైవర్లకు శిక్షణ ఇవ్వాలని, ఈ ఖర్చును వారే భరించాలని షరతు విధించింది. దాంతో విమర్శలు వ్యక్తమయ్యాయి. మోదీ ప్రభుత్వంలో లోక్‌పాల్ పనితీరు తేలిపోయిందని, అవినీతిని పట్టించుకోకుండా విలాసాల కోసం చూస్తున్నారని విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. అవినీతిపై పోరాడాల్సింది పోయి విలాసవంతమైన కార్లను లోక్‌పాల్ కొనుగోలు చేస్తోందని మండిపడ్డాయి.

## పాక్ డ్రోన్ కలకలం

**న్యూఢిల్లీ :** నూతన సంవత్సరం వేళ.. నియంత్రణ రేఖ వెంబడి పాక్ డ్రోన్ కలకలం సృష్టించినట్లు తెలుస్తోంది. భారత గగనతలంలోకి ప్రవేశించి ఐఈడీ, మాదక ద్రవ్యాలను జారవిడిచినట్లు సమాచారం. ఈ క్రమంలో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయని అధికార వర్గాలు తెలిపినట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. కథనాల ప్రకారం.. జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ సెక్టార్‌లోని నియంత్రణరేఖ వెంబడి ఈ ఘటన చోటుచేసుకుంది. ఖాదీ కర్మదా ప్రాంతంలోకి పాక్ డ్రోన్ చొరబడింది. దాదాపు ఐదు నిమిషాల పాటు అక్కడే చక్కర్లు కొట్టింది. ఈ క్రమంలోనే ఐఈడీ, మందుగుండు సామగ్రి, డ్రగ్స్‌ను జారవిడిచింది. డ్రోన్ కదలికలను గుర్తించిన వెంటనే భద్రతాధికారులు అప్రమత్తమయ్యారు. డ్రోన్ నుంచి జారిపడిన వస్తువులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఏదైనా ఉగ్రదాడి జరిగే అవకాశం ఉందా అనే కోణంలో ఖాదీ కర్మదాతో సహా పరిసర ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు ప్రారంభించారు. ఈ ఘటన పూంఛ్ ప్రాంతంలో జరగబోయే ఉగ్రదాడిలో భాగంగా అనుమానిస్తున్నామని ఓ అధికారి తెలిపారు. నూతన సంవత్సరంలో పాక్ మద్దతున్న ఉగ్రవాద గ్రూపులు జమ్మూకశ్మీర్‌లో దాడికి ప్లాన్ చేశాయని గతంలో నిఘా వర్గాలు సూచించాయన్నారు. ఈ నేపథ్యంలో భారత సైన్యం జమ్మూకశ్మీర్ పోలీసులతో కలిసి నియంత్రణ రేఖ వెంబడి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# డిసెంబర్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.1.74 లక్షల కోట్లు




**ఢిల్లీ:** దేశంలో వస్తు, సేవల పన్ను వసూళ్లు స్వల్ప వృద్ధి నమోదైంది. 2025 డిసెంబర్ నెలలో స్థూలంగా రూ.1.74 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే 6.1 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. జీఎస్టీ రేట్ల కోత కారణంగా దేశీయ విక్రయాల నుంచి వచ్చే వసూళ్లు నెమ్మదించినట్లు కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు డిసెంబర్ నెలకు సంబంధించిన గణాంకాలను గురువారం విడుదల చేసింది. 2024 డిసెంబర్ నెలలో రూ.1.64 లక్షల కోట్లు వసూళ్లు నమోదయ్యాయి. దేశీయ లావాదేవీల్లో 1.2 శాతం వృద్ధితో రూ.1.22 లక్షల కోట్లు వసూళ్లు నమోదు కాగా.. దిగుమతైన వస్తువులపై జీఎస్టీ వసూళ్లు (19.7 శాతం వృద్ధి) రూ.51,977 కోట్లుగా ఉన్నాయి. రిఫండ్ల రూపంలో రూ.28,980 కోట్లు తిరిగి చెల్లించినట్లు కేంద్రం పేర్కొంది. దీంతో నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.45 లక్షల కోట్లుగా లెక్క తేలింది. నికర వసూళ్లలో గతేడాదితో పోలిస్తే కేవలం 2.2 శాతం మాత్రమే వృద్ధి నమోదైంది. గతేడాది సెప్టెంబర్ 22న 375 రకాల వస్తువులపై జీఎస్టీ రేట్లను కేంద్రం తగ్గించిన సంగతి తెలిసిందే. దీంతో ఆ మేర రెవెన్యూపై ప్రభావం చూపింది.






## ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. మార్కెట్‌ను ముందుకు నడిపించే అంశాలేవీ లేకపోవడంతో సందడి వాతావరణం పెద్దగా కనిపించలేదు. సిగరెట్లపై ఫిబ్రవరి 1 నుంచి 40 శాతం జీఎస్టీ అమలౌతుందని కేంద్రం నిర్ణయం తీసుకోవడంతో ఐటీసీ షేర్లు 9 శాతం మేర కుంగాయి. ఏజీఆర్ బకాయిలపై కేంద్ర క్యాబినెట్ మారటోరియం ప్రకటన నేపథ్యంలో వొడాఫోన్ ఐడియా షేర్లు నేడు 8 శాతం మేర లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 85,255.55 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,220.60) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభనష్టాల మధ్య ఓ మోస్తరు శ్రేణిలోనే చలించింది. చివరికి 32 పాయింట్ల నష్టంతో 85,188.60 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 16.95 పాయింట్ల లాభంతో 26,146.55 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.98గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, బీఈఎల్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎన్టీపీసీ, ఎటెర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 60.79 డాలర్లు, బంగారం 4317 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.



## సర్ఫరాజ్ ఖాన్‌ను విస్మరించడం బాధాకరం : దిలీప్ వెంగ్‌సర్కార్

సర్ఫరాజ్ ఖాన్‌కు మూడు ఫార్మాట్లలో ఆడే సత్తా ఉందని, అతడిని జాతీయ జట్టులోకి తీసుకోకపోవడం బాధాకరమని మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ అన్నాడు. సరారేజ్ ఇటీవల దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మెరిసిన అతను ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలోనూ అదరగొడుతున్నాడు. ఇటీవల గోవాపై 75 బంతుల్లోనే 157 పరుగులు చేశాడు. ఇందులో 9 ఫోర్లు, 14 సిక్స్‌లున్నాయి. ఈ నేపథ్యంలో సరారేజ్‌ను జాతీయ జట్టులోకి తీసుకోవాలని అభిమానులు, పలువురు మాజీలు డిమాండ్ చేస్తున్నారు. 'అవకాశం వచ్చినప్పుడల్లా సర్ఫరాజ్ ఖాన్ నిలకడగా రాణిస్తున్నా టీమ్‌ఇండియాకు ఏ ఫార్మాట్‌లోనూ ఎందుకు ఎంపిక చేయడం లేదో నాకు అర్థం కావడం లేదు. ధర్మశాలలో ఇంగ్లాండ్‌పై దేవ్‌దత్ పడిక్కల్‌తో కలిసి సరారేజ్ బ్యాటింగ్ చేయడం చూశాను. అది చాలా కీలకమైన సెషన్. వారు చాలా అదుతేంగా బ్యాటింగ్ చేసి కీలకమైన భాగస్వామ్యం నెలకొల్పి జట్టు విజయానికి తోడ్పడ్డారు. స్వదేశంలో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్ తర్వాత అతనికి మళ్లీ టెస్టులు ఆడే అవకాశం రాలేదు. 2024-25 బోర్డర్-గావస్కర్ ట్రోఫీకి ఎంపిక చేసినప్పటికీ ఒక్క మ్యాచ్‌లోనూ తుది జట్టులోకి తీసుకోలేదు. సరారేజ్‌కు మూడు ఫార్మాట్లలో ఆడే సత్తా ఉంది. అలాంటి ప్రతిభావంతుడిని విస్మరిస్తున్నారు. ఇది బాధాకరం' అని దిలీప్ వెంగ్‌సర్కార్ అన్నాడు.



## ఉజ్జయిని మహాకాళేశ్వర్ దేవాలయాన్ని సందర్శించిన స్మృతి మంధాన

భారత మహిళల జట్టు ఓపెనర్ స్మృతి మంధాన తన సహచరులైన షెఫాలీ వర్మ, రేణుకాసింగ్ ఠాకూర్, స్నేహ్ రాణా, రాధా యాదవ్, అరుధంతిరెడ్డి తదితరులతో కలిసి ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ దేవాలయాన్ని సందర్శించారు. నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భస్మ హారతికి హాజరయ్యారు. భారత మహిళల జట్టు తాజాగా శ్రీలంకతో జరిగిన అయిదు టీ20ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన విషయం తెలిసిందే. తిరువనంతపురం వేదికగా జరిగిన చివరి టీ20లో టీమ్‌ఇండియా 15 పరుగుల తేడాతో విజయం సాధించింది. టీ20ల్లో ఓ జట్టు ఇలా 5-0 తేడాతో సిరీస్ గెలవడం ఇది కేవలం మూడోసారి మాత్రమే. ఇంతకు ముందు 2019లో వెస్టిండీస్, 2024లో బంగ్లాదేశ్ ఈ ఫీట్ సాధించాయి. స్వదేశంలో ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను ఓడించి, వరల్డ్‌కప్‌ను కైవసం చేసుకున్న తర్వాత టీమ్‌ఇండియా ఈ టీ20 సిరీస్‌ను గెలుచుకొని రికార్డ్ సృష్టించింది. భారత జట్టు ఫిబ్రవరిలో ఆస్ట్రేలియాలో, మేలో ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. తర్వాత ఇంగ్లాండ్ వేదికగా.. జూన్ 12 నుంచి జులై 5 వరకు టీ20 వరల్డ్ కప్ 2026 జరగనుంది. ఇప్పటికే వన్డే వరల్డ్‌కప్‌ను సొంతం చేసుకున్న టీమ్‌ఇండియా పొట్టి కప్‌ను కూడా కైవసం చేసుకోవాలని చూస్తోంది.

## టీ20 వరల్డ్ కప్.. ఆస్ట్రేలియా జట్టు ప్రకటన

భారత్, శ్రీలంక వేదికగా టీ20 వరల్డ్ కప్ 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనుంది. దీనికి సంబంధించి బీసీసీఐ ఇప్పటికే భారత జట్టును ప్రకటించింది. తాజాగా క్రికెట్ ఆస్ట్రేలియా మిచెల్ మార్ష్ సారథ్యంలో.. 15 మంది సభ్యులతో కూడిన తమ టీమ్‌ను ప్రకటించింది. దీనికి సంబంధించి సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసింది. వెన్నెముక గాయం నుంచి కోలుకుంటున్న కమిన్స్, అడిలైడ్‌లో జరిగిన మూడో యాషెస్ టెస్ట్‌లో మాత్రమే ఆడాడు. అతడికి ఈనెల చివర్లో స్కాన్ నిర్వహించనున్నారు. దాని ఫలితం ఆధారంగా తుది జట్టులో అతడు భాగమవుతాడో.. లేదో తెలుస్తుంది. అయితే, సెలక్టర్ల ఛైర్మన్ జార్జ్ బెయిలీ మాట్లాడుతూ.. 'కమిన్స్, హేజిల్‌వుడ్, డేవిడ్‌లు కోలుకుంటున్నారు. ఈ ముగ్గురూ టోర్నమెంట్ సమయానికి ఫిట్‌గా ఉంటారు' అని అతడు విశ్వాసం వ్యక్తంచేశారు. ఇటీవల జరిగిన బిగ్‌బాష్ లీగ్ మ్యాచ్‌లో డేవిడ్ గ్రేడ్ టూ హామ్‌స్ట్రింగ్ గాయానికి గురయ్యాడు. అలాగే హేజిల్‌వుడ్ హామ్‌స్ట్రింగ్ గాయం తర్వాత చీలమండల నొప్పితో యాషెస్ సిరీస్‌కు దూరమైన విషయం తెలిసిందే.

**ఆస్ట్రేలియా జట్టు ఇదే..**

మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, కూపర్ కానెల్లీ, పాట్ కమ్మిన్స్, టిమ్ డేవిడ్, కామెరూన్ గ్రీన్, నాథన్ ఎల్లిస్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మ్యాథ్యూ కునెమన్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, మ్యాథ్యూ షార్ట్, మార్కస్ స్టాయినిస్, ఆడమ్ జంపా.

## ఉస్మాన్ ఖవాజా అప్పుడే రిటైరవుతాడు : మైఖేల్ క్లార్క్

**ఆస్ట్రేలియా సీనియర్ బ్యాటర్ ఉస్మాన్ ఖవాజా యాషెస్ సిరీస్‌లో భాగంగా త్వరలో జరగనున్న అయిదో టెస్ట్ మ్యాచ్ తర్వాత రిటైరవుతాడని ఆసీస్ మాజీ క్రికెటర్ మైఖేల్ క్లార్క్ అన్నాడు. 39 సంవత్సరాల ఉస్మాన్ ఖవాజా ఈ సిరీస్‌లో నాలుగో టెస్ట్ మ్యాచ్ సందర్భంగా అంతర్జాతీయ క్రికెట్‌లో 8,000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఇప్పటి వరకు యాషెస్ సిరీస్‌లో పెద్దగా రాణించలేదు. కేవలం ఒక్క హాఫ్‌సెంచరీ మాత్రమే చేశాడు.**



'నాకు తెలిసి ఇది (అయిదో టెస్ట్) ఉస్మాన్ ఖవాజాకు చివరి టెస్ట్. సిడ్నీలో జరగబోయే మ్యాచే అతడి కెరీర్‌లో చివరిది కానుంది. అయితే అతడు ఆఖరి మ్యాచ్‌లో పెద్ద స్కోర్ చేయాలని కోరుకుంటున్నాను. అతడు మెల్‌బోర్న్‌లోనూ సెంచరీ చేయలేదు. చివరి మ్యాచ్‌లో భారీ స్కోర్ చేసి అతడు వీడ్కోలు పలకాలి. ఇలాంటి అవకాశం చాలా మందికి రాదు ' అని మైఖేల్ క్లార్క్ అన్నాడు. ఆసీస్ మాజీ క్రికెటర్ మ్యాథ్యూ హెడెన్ ఆస్ట్రేలియా టాప్ ఆర్డర్ వైఫల్యాలను ప్రశ్నించాడు. లబుషేన్, ఉస్మాన్ ఖవాజా, కామెరూన్ గ్రీన్ పరుగులు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇంగ్లాండ్‌తో నాలుగో మ్యాచ్ అనంతరం హెడెన్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ టెస్ట్‌లో ఆస్ట్రేలియా నాలుగు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఆసీస్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 152, రెండో ఇన్నింగ్స్‌లో 132 పరుగులు మాత్రమే చేసింది. ఈ మ్యాచ్‌లో బ్యాటర్లెవరూ కూడా కనీసం హాఫ్ సెంచరీ సైతం చేయలేకపోయారు. 'ఈ స్కోర్ కార్డ్ ఊహించదగింది కాదు. ట్రావిస్ హెడ్, వెదర్లాడ్, లబుషేన్, ఖవాజా, కేరీ, గ్రీన్.. వీరి బేసిక్ టెక్నిక్ సరిగా లేదు. ఆసీస్ బ్యాటర్లకంటే బౌలర్ల టెక్నిక్కే బాగుంది' అని మ్యాథ్యూ హెడెన్ అన్నాడు. యాషెస్ సిరీస్‌ను ఆస్ట్రేలియా ఇప్పటికే సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అయిదో టెస్ట్ మ్యాచ్ జనవరి 4న సిడ్నీ వేదికగా ప్రారంభం కానుంది.

## సిక్స్‌ల వర్షం కురిపించిన డెవాల్డ్ బ్రెవిస్, రూథర్‌ఫోర్డ్



కేప్‌టౌన్ వేదికగా ఎస్‌ఏ20లో భాగంగా బుధవారం ప్రిటోరియా క్యాపిటల్స్, ఎమ్‌ఐ కేప్‌టౌన్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన ప్రిటోరియా క్యాపిటల్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన ఎమ్‌ఐ కేప్ టౌన్ జట్టు 14.2 ఓవర్లలో 135 పరుగులకే ఆలౌటైంది. దీంతో ప్రిటోరియా క్యాపిటల్స్ 85 రన్స్ తేడాతో విజయం సాధించింది. క్యాపిటల్స్ ఇన్నింగ్స్‌లో డెవాల్డ్ బ్రెవిస్, రూథర్‌ఫోర్డ్ సిక్స్‌ల వర్షం కురిపించారు. వారు రెండు ఓవర్లలో ఆరు సిక్స్‌లు బాదారు. వీరి తుపాన్ ఇన్నింగ్స్‌తో ఆ జట్టు ఈ సీజన్‌లో తమ తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. వీరి జోడీ డెత్ ఓవర్లలో విధ్వంసం సృష్టించింది. డెవాల్డ్ బ్రెవిస్ 13 బంతుల్లో 276.92 స్ట్రైక్ రేట్‌తో 36 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఇందులో ఒక ఫోర్, నాలుగు సిక్స్‌లున్నాయి. రూథర్‌ఫోర్డ్ 313.33 స్ట్రైక్ రేట్‌తో 15 బంతుల్లో 47లి పరుగులు చేశాడు. ఇందులో ఆరు సిక్స్‌లున్నాయి. వీరిద్దరూ కేవలం 27 బంతుల్లోనే 84 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అలాగే ఈ జోడి చివరి మూడు ఓవర్లలో ఏకంగా 72 పరుగులు సాధించింది. క్యాపిటల్స్ బ్యాటర్లలో విహాన్ లుబ్బే (60, 36 బంతుల్లో, 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఎమ్‌ఐ కేప్‌టౌన్ బౌలర్లలో రబాడ 2, ట్రెంట్ బౌల్ట్, జార్జి లిండే, కోర్బిన్ బోస్ తలో వికెట్ తీసుకున్నారు. ఎమ్‌ఐ కేప్ టౌన్ బ్యాటర్లలో వికెట్ కీపర్ బ్యాటర్ ర్యాన్ రికెల్టన్ (33, 17 బంతుల్లో, 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్. రాస్సీ వాన్ డెర్ డస్సెన్ 28, నికోలస్ పూరన్ 25 ఫర్వాలేదనిపించారు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ప్రిటోరియా క్యాపిటల్స్ బౌలర్లలో కేశవ్ మహరాజ్ 3, టైమల్ మిల్స్, విలియమ్స్, బ్రైస్ పార్సన్స్ తలో వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు.

## సిగరెట్, పాన్ మసాలాపై 40% జీఎస్టీ..

### ఫిబ్రవరి 1 నుంచి వర్తింపు



పొగాకు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం, పాన్ మసాలాపై సెస్సు విధిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అది ఫిబ్రవరి 1 నుంచి వర్తించనుందని తాజాగా నోటిఫికేషన్ ఇచ్చింది. పాన్ మసాలా, సిగరెట్లు, పొగాకు, సంబంధిత ఉత్పత్తులపై 40 శాతం.. బీడీలపై 18 శాతం కేంద్రం జీఎస్టీ విధించింది. ఈ పన్నుతో పాటు పాన్ మసాలాపై ఆరోగ్య, జాతీయ భద్రత సెస్ పెంపు, పొగాకుతో పాటు సంబంధిత ఉత్పత్తులకు ఎక్సైజ్ సుంకం వేసింది. ఇవన్నీ ఫిబ్రవరి ఒకటో తారీఖు నుంచి అమలవుతాయి. పాన్ మసాలా తయారీపై ఆరోగ్య, జాతీయ భద్రత సెస్, పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ డ్యూటీ విధించేలా రెండు బిల్లులను పార్లమెంట్ డిసెంబర్‌లో ఆమోదించింది. 'హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు-2025' బిల్లును ఆమోదించిన సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ మాట్లాడుతూ.. 'పాన్‌మసాలపై ఇప్పటికే 40శాతం జీఎస్టీ విధిస్తున్నారు. దీనికి సెస్ అదనం. తయారీ కేంద్రాల ఉత్పత్తి సామర్థ్యాన్ని బట్టి సెస్ చెల్లించాల్సి ఉంటుంది. ఇలా సమకూరే నిధులను జాతీయ భద్రత బలోపేతానికి, ప్రజారోగ్యం కోసం ఖర్చు చేయనున్నాం" అని వెల్లడించారు.



## ఏటీఎఫ్ ధర తగ్గింది.. ఎల్పీజీ ధర పెరిగింది

**ఢిల్లీ:** విమానాల్లో వినియోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలను ప్రభుత్వరంగ చమురు కంపెనీలు భారీగా తగ్గించాయి. విమానయాన రంగానికి ఊరట కల్పిస్తూ ఏటీఎఫ్ ధరలో 7.3 శాతం మేర కోత పెట్టాయి. అదే సమయంలో కమర్షియల్ సిలిండర్ ధరలను రూ.111 చొప్పున పెంచాయి. నెలవారీ మదింపులో భాగంగా అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా చమురు సంస్థలు ఈ ధరల సవరణ చేపట్టాయి. పెరిగిన ధరలు నేటినుంచే అమల్లోకి రానున్నాయి. ధరల సవరణ తర్వాత దిల్లీలో ఏటీఎఫ్ ధర కిలో లీటరుకు రూ.7,353.75 తగ్గి రూ.92,323.02కి చేరింది. అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లలో వరుసగా మూడుసార్లు ఏటీఎఫ్ ధరలను పెంచుతూ వచ్చాయి. చమురు కంపెనీల తాజా నిర్ణయంతో విమానయాన సంస్థలపై ఆర్థికంగా భారం తగ్గనుంది. విమానాలు నడిపేందుకు అయ్యే మొత్తం ఖర్చులో ఏటీఎఫ్‌దే 40 శాతం వాటా. స్థానిక ట్యాక్సుల కారణంగా ఏటీఎఫ్ ధర దేశంలోని ఒక్కో నగరంలో ఒక్కోలా ఉంటుంది. మరోవైపు 19 కేజీల కమర్షియల్ సిలిండర్ ధరను చమురు కంపెనీలు రూ.111 చొప్పున పెంచాయి. తాజా నిర్ణయంతో దిల్లీలో కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,691.50కి చేరింది. గత రెండు నెలలుగా ఈ ధరలను చమురు కంపెనీలు తగ్గించుకుంటూ వచ్చాయి. ధరల పెంపు నిర్ణయంతో హొటళ్లు, రెస్టరంట్లపై భారం పడనుంది. అదే సమయంలో ఇంట్లో వాడే ఎల్పీజీ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. చివరిసారిగా 2025 ఏప్రిల్‌లో రూ.50 చొప్పున పెంచాయి. అంతర్జాతీయ ధరలు, రూపాయి మారకం విలువ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఐఓసీ, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం ఏటీఎఫ్, ఎల్పీజీ ధరలను ప్రతినెలా ఒకటో తేదీన సవరిస్తుంటాయి.





## తాజ్ జీవీకే నుంచి టాటా నిష్క్రమణ

**హైదరాబాద్:** ఆతిథ్య రంగంలో దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న ఒక ప్రతిష్ఠాత్మక భాగస్వామ్యానికి తెరపడింది. టాటా గ్రూపునకు చెందిన ఇండియన్ హొటల్స్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్‌సీఎల్).. తాజ్ జీవీకే హొటల్స్ అండ్ రిసార్ట్స్ ఉమ్మడి భాగస్వామ్యం నుంచి పూర్తిగా తప్పుకుంది. తాజ్ జీవీకేలో తనకున్న 25.52% వాటాను ప్రమోటర్ గ్రూపునకు చెందిన షాలినీ భూపాల్‌కు విక్రయించినట్లు ఐహెచ్‌సీఎల్ వెల్లడించింది. 1.60 కోట్ల షేర్లను, ఒక్కోటి రూ.370 ధరతో, మొత్తం రూ.592 కోట్లకు ఐహెచ్‌సీఎల్ విక్రయించింది. ఫలితంగా తాజ్ జీవీకేలో జీవీకే-భూపాల్ కుటుంబ వాటా 49 శాతం నుంచి 74.99 శాతానికి పెరిగి, సంస్థపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు లభించాయి. బోర్డులోని ఐహెచ్‌సీఎల్ నామినేటెడ్ డైరక్టర్లందరూ తమ పదవులకు రాజీనామా చేశారు. 2011 నాటి షేర్‌హోల్డర్స్, 2007నాటి ట్రేడ్‌మార్క్ లైసెన్స్ ఒప్పందాలూ రద్దయ్యాయి.

**సంస్థ పేరు నుంచి 'తాజ్'ను తొలగించే అవకాశం:** యాజమాన్య మార్పిడి నేపథ్యంలో సంస్థ తన కార్పొరేట్ పేరు నుంచి తాజ్ అనే పదాన్ని తొలగించి, కొత్త పేరు స్వీకరించే ప్రక్రియను ప్రారంభించింది. గతంలో చేసుకున్న హొటల్ నిర్వహణ ఒప్పందాలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయి. అంటే, ప్రస్తుతానికి తాజ్ కృష్ణా, తాజ్ డెక్కన్ వంటి హొటళ్లు పాత బ్రాండ్ పేర్లతోనే కార్యకలాపాలు సాగిస్తాయి. ఐహెచ్‌సీఎల్ ఇకపై కేవలం నిర్వహణ భాగస్వామిగా మాత్రమే సేవలను అందించనుంది. ఇది టాటా గ్రూపు అనుసరిస్తున్న 'క్యాపిటల్ లైట్' (ఆస్తులపై పెట్టుబడి తగ్గించి, సేవలపై దృష్టి పెట్టడం) వ్యూహంలో భాగమని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. స్టాక్‌మార్కెట్లో జరిగిన కీలక లావాదేవీల్లో ప్రమోటర్ గ్రూపునకు చెందిన స్టార్‌లైట్ ట్రస్ట్ (12.5 లక్షల షేర్లు), మూన్‌లైట్ ట్రస్టు (12.5 లక్షల షేర్లు) తమకున్న సుమారు 3.98% వాటాకు సమానమైన 25 లక్షల షేర్లను, ఓపెన్ మార్కెట్లో ఒక్కో షేరు రూ.420.34 చొప్పున.. మొత్తం రూ.105 కోట్లకు విక్రయించాయి. వీటిలో అధిక భాగాన్ని ప్రముఖ మ్యూచువల్ ఫండ్ సంస్థ నిప్పన్ ఇండియా కైవసం చేసుకుంది. నిప్పన్ ఇండియా తన ఏఐఎఫ్ పథకం ద్వారా సుమారు 15.2లక్షల షేర్లను (2.4% వాటా) కొనుగోలు చేసింది. రానున్న కాలంలో బెంగళూరులోని యలహంక వద్ద నిర్మిస్తున్న కొత్త హొటల్‌తో కలిపి తన సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాలని జీవీకే గ్రూపు భావిస్తోంది.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



## ఈ ప్రయాణం ఎంతో ప్రత్యేకం

క్రేజీ బ్యూటీ వైష్ణవి చైతన్య నటిస్తున్న తాజా చిత్రం 'ఎపిక్' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు క్రియేట్ చేస్తోంది. ఈ సినిమాలో ఆమె మరోసారి ఆనంద్ దేవరకొండ సరసన హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. '90 బయోపిక్' వెబ్ సిరీస్‌తో యు-వత హృదయాలను దోచుకున్న దర్శకుడు ఆదిత్య హాసన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో, ఈ ప్రాజెక్ట్‌పై ప్రారంభం నుంచే ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు వైష్ణవి చైతన్య సోషల్ మీడియా ద్వారా అధికారికంగా వెల్లడించింది.సెట్‌లో చివరి రోజు.. కానీ జ్ఞాపకాలు మాత్రం జీవితాంతం నిలిచిపోయేలా ఉన్నాయి. ఈ ప్రయాణం నాకు కేవలం ఒక సినిమా షూటింగ్‌గా కాకుండా, ఒక అందమైన జీవిత అనుభవంగా మారిపోయిందని ఎమోషనల్ అయింది. అలాగే ప్రతి రోజు కొత్త ఉత్సాహం, కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం, హృదయాన్ని తాకే క్షణాలతో నిండిపోయింది. కెమెరా ఆన్ అయ్యే ముందు నుంచే, కట్ అన్న తర్వాత కూడా ప్రతి క్షణం ఆనందం, నవ్వులు, ఆప్యాయతతో నిండిపోయిందని చెప్పింది. ఈ సినిమా సెట్‌లో గడిపిన సమయం తనకు ఎంతో ప్రత్యేకమంటూ పేర్కొంది. ఇక్కడ కలిసిన ప్రతి వ్యక్తి నా జీవితంలో ఒక మధురమైన జ్ఞాపకంగా మారిపోయారు. సహనటులు, దర్శకుడు, సాంకేతిక బృందం, ప్రతి ఒక్కరూ కలిసి ఒక కుటుంబంలా మారిపోయారు. ఒకే లక్ష్యంతో, ఒకే కలతో ముందుకు సాగిన ఈ ప్రయాణం నాకు ఎంతో బలాన్ని, సానుకూలతను ఇచ్చిందంటూ తన స్పెషల్ మూమెంట్స్ గురించి వివరించింది. ప్రతి రోజు సెట్‌లోకి అడుగుపెట్టినప్పుడు ఒక ప్రత్యేకమైన ఎనర్జీ అనిపించేది. ఆ ప్రేమ, ఆ గౌరవం, ఆ స్నేహం ఇవన్నీ నేను ఎప్పటికీ మర్చిపోలేను. ఇంత అందమైన అనుభవంలో భాగమయ్యే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నానని రాసుకొచ్చింది. అంతేకాకుండా మూవీ టీమ్‌తో తీసుకున్న ఫొటోలను షేర్ చేసింది.

## సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో
# పవన్ కొత్త సినిమా

కొత్త ఆశలు.. అంచనాలతో సినీ తారలందరూ 2026కు స్వాగతం పలికారు. ఈ న్యూ ఇయర్‌కు పవన్ కల్యాణ్ అభిమానులకు గుడ్‌న్యూస్ చెబుతూ గిఫ్ట్ ఇచ్చారు. ఆయన హీరోగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో ఒక సినిమా రానున్నట్లు నిర్మాత రామ్ తాళ్లూరి అధికారికంగా తెలిపారు. పవన్ కళ్యాణ్ పేరు పెట్టిన సంస్థ.. జైత్ర రామ్ మూవీస్ బ్యానర్‌పై ఈ సినిమా రానున్నట్లు పోస్టు పెట్టారు. త్వరలోనే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు. ఇక ఈ ఏడాది ప్రతిఒక్కరి జీవితాల్లో వెలుగులు నిండాలని, నటీనటుల ఖాతాల్లో హిట్‌లు పడాలని కోరుకుంటూ మూవీ టీమ్స్ కొత్త సినిమా పోస్టర్లను షేర్ చేశాయి. అగ్ర, యువ కథానాయకులకు సంబంధించిన కొత్త సినిమాల అప్‌డేట్‌లు, లుక్స్‌తో సినీ ప్రియులు నెట్టింట పండగ చేసుకుంటున్నారు.




# స్పిరిట్ నుంచి ప్రభాస్ లుక్ విడుదల

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' నూతన సంవత్సరం సందర్భంగా డార్లింగ్ అభిమానులకు దర్శకుడు సందీప్ అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చారు. మూవీలోని ప్రభాస్ లుక్‌ను విడుదల చేశారు. ఇప్పటివరకూ తెరపై చూడని సరికొత్త అవతారంలో ప్రభాస్ కనిపించారు. ఒళ్లంతా గాయాలతో కమిలిపోయి ఉండగా, బ్యాండ్-ఎయిడ్‌లు కట్టుకుని ప్రభాస్ వెనక్కి తిరిగి నిలబడ్డారు. ఆయన ముందు త్రిప్తి దిమ్రి నిలబడి ఉంది. రా అండ్ రస్టిక్‌గా ఉన్న ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. చూడడానికి 'యానిమల్'లో రణ్‌బీర్ పాత్ర ఛాయలు కనిపిస్తున్నా, ప్రభాస్ కటౌట్ కావడంతో అంతకు మించిన హైఓల్టేజ్ యాక్షన్ చూపించబోతున్నట్లు అర్థమవుతోంది. 'ఇండియన్ సినిమా.. మీ ఆజానుబాహుడు/ఆజానుబాహు'ను చూడండి. హ్యాపీ న్యూఇయర్ 2026' అని సందీప్ వంగా పేర్కొన్నారు. 'మీరు ఇప్పటివరకూ ఉన్న దానిని ప్రేమించారు. ఇక నుంచి మీకు తెలియనిదానితో ప్రేమలో పడండి' అని టీమ్ పేర్కొంది. ఇందులో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. సినిమా ప్రారంభం సందర్భంగా 'సౌండ్ స్టోరీ' పేరుతో ఓ ఆడియో టీజర్‌ని విడుదల చేసింది చిత్రబృందం. ప్రభాస్ అకాడమీ టాపర్ అయిన ఐపీఎస్ అధికారిగా కనిపించనున్నట్టు తెలుస్తోంది. పోలీసు అధికారి అయినా రిమాండ్ ఖైదీగా జైలుకు వెళ్లాల్సి వస్తుంది. అక్కడ జైలర్‌గా ఉన్న ప్రకాశ్‌రాజ్‌కీ, ప్రభాస్‌కీ మధ్య సంభాషణ టీజర్‌కి ఆకర్షణగా నిలిచింది. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో సందీప్ చూపించబోతున్నారట. ముఖ్యంగా ద్వితీయార్థంలో ఇందుకు సంబంధించిన సన్నివేశాలు ప్రేక్షకులకు థ్రిల్ పంచుతాయని తెలుస్తోంది. ఇదే కథకు ప్రాణమని, మొత్తం సినిమాను మలుపు తిప్పే ఎపిసోడ్ అవుతుందని అంటున్నారు. దీనిపై స్పష్టత రావాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. ఇక ఇందులో త్రిప్తి దిమ్రి కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. టి - సిరీస్, భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్ సంస్థలపై ప్రణయ్‌రెడ్డి వంగా, భూషణ్‌కుమార్, క్రిషన్‌కుమార్ నిర్మిస్తున్నారు.



# సైకలాజికల్ హారర్ మూవీ 'హనీ'




నవీన్ చంద్ర, దివ్య పిళ్ళై కీలక పాత్రల్లో నటిస్తున్న లేటెస్ట్ సైకలాజికల్ హారర్ మూవీ 'హనీ'. శేఖర్ స్టూడియోస్ సమర్పణలో క్షుం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మాణంలో దర్శకుడు కరుణ కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రియల్ లైఫ్‌లో జరిగిన పలు సంఘటనలను ఆధారంగా చేసుకుని రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే ఆసక్తికరమైన బజ్‌ను క్రియేట్ చేస్తోంది. న్యూ ఇయర్ కానుకగా మేకర్స్ నేడు 'హనీ' మూవీ ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ విడుదలైనప్పటి నుంచే సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు, డార్క్ సైకలాజికల్ ఎలిమెంట్స్‌ను కలగలిపి, ప్రేక్షకులను భయపెట్టే విధంగా ఈ సినిమాను తెరకెక్కించినట్లు గ్లింప్స్ ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా కథను రూపొందించడం సినిమాపై అంచనాలను మరింత పెంచింది. గ్లింప్స్‌లో కనిపించే విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాత్రల ప్రవర్తన అన్ని కలిసి ఓ డిస్టర్బింగ్, మిస్టీరియస్ వాతావరణాన్ని క్రియేట్ చేస్తున్నాయి. నవీన్ చంద్ర పాత్ర చాలా డిఫరెంట్ షేడ్స్‌తో ఉండబోతుందని, దివ్య పి÷-లళై క్యారెక్టర్ కథలో కీలక మలుపులు తిప్పబోతుందనే సంకేతాలు గ్లింప్స్‌లో కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో దివి, రాజా రవీంద్ర, బేబీ జయన్ని, బేబీ జయత్రి తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. దర్శకుడు కరుణ కుమార్ గతంలో రియలిస్టిక్ టచ్‌తో కథలను చెప్పిన అనుభవాన్ని ఈసారి హారర్ జానర్‌లో ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.'హనీ' సినిమా ఫిబ్రవరి 6న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. హారర్ సినిమాలకి కరెక్ట్ సీజన్‌లో ఈ సినిమా రావడంతో మంచి రెస్పాన్స్ వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

## కొందరు నా ఫెయిల్యూర్
# కోరుకుంటున్నారు

### రాజాసాబ్ డైరెక్టర్ మారుతి వ్యాఖ్య





సంక్రాంతి బరిలో నిలవనున్న 'ది రాజాసాబ్' ప్రచారంలో మారుతి బిజీగా ఉన్నారు. ప్రభాస్ హీరోగా తెరకెక్కిన ఈ హారర్ కామెడీ చిత్రం జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మారుతి ఒక ఆసక్తికర ప్రశ్నకు సమాధానమిచ్చారు. 'మీరు విజయం సాధించకూడదని కొందరు కోరుకుంటున్నారు. ఈ సినిమాకు కూడా ఆదరణ రాకూడదని అనుకుంటున్నారు. వాళ్లు అలా ఎందుకు ఆలోచిస్తున్నారు' అనే ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. తాను ఎదిగితే బిజీ అయిపోతానని కొందరు అలా భావిస్తున్నారని అన్నారు. ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు కోరుకుంటారు. పక్కింటి వాళ్లు కారు కొనుక్కుంటే దానికి ఏదైనా అవ్వాలని కోరుకోవచ్చు. ఈర్ష్య, అసూయ మానవ నైజం. నేను విజయం సాధించి ఎదిగితే వాళ్లకు దొరకనేమో అనే భయంతోనే అలా అనుకుంటారు. నేను ఇప్పుడు చిన్న సినిమాల ఈవెంట్లకు వెళ్తున్నాను. ఒకవేళ నాకు భారీ సక్సెస్ వస్తే అలా రానేమో అని వాళ్ల భయం. వాళ్లు అసూయ వల్ల అలా అనుకుంటున్నారు కానీ.. నేను అలా ఆలోచించేవాడిని కాదు. ఈసారి కథ చెబుదామని నా దగ్గరకు వస్తే నేను పట్టించుకోనేమో.. అదే ఫెయిల్ అయితే మనల్ని చూస్తాడని వాళ్లు అనుకుంటున్నారని మారుతి అన్నారు. 'ది రాజాసాబ్' తర్వాత చిన్న సినిమా తీయాలనుకుంటే తీస్తాను. చాలా కథలు ఉన్నాయి. అగ్ర నటుడితో తీశాను కదా.. అన్నీ ఆ స్థాయిలోనే తెరకెక్కించాలి అనే కోరికలు లేవు. నాకు కథ ముఖ్యం. ఏ హీరో సెట్ అవుతారు అనుకుంటే ఆయనతో తీస్తాను. ఎప్పుడూ పని ఉండాలని మాత్రం కోరుకుంటానని చెప్పారు.

# సంక్రాంతి బరిలో అనగనగా ఒక రాజు

## అందరూ ఆదరించాలన్న నవీన్ పొలిశెట్టి

'సంక్రాంతి సినిమా అంటేనే వినోదం. అందుకే కడుపుబ్బా నవ్వించే మా 'అనగనగా ఒక రాజు' చిత్రాన్ని పండక్కి విడుదల చేస్తున్నాం. దీన్ని కుటుంబ సమేతంగా చూసి ఆనందించాలని కోరుతున్నాం' అని కథానాయకుడు నవీన్ పొలిశెట్టి అన్నారు. మీనాక్షి చౌదరి జంటగా నటించిన ఈ చిత్రాన్ని మారి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. 'వరుసగా మూడు విజయాల తర్వాత అదే ఉత్సాహంలో అందరి ముందుకు మరో అదిరిపోయే చిత్రం తీసుకొద్దామనుకున్నా. కానీ, ఓ యాక్సిడెంట్ వల్ల కొన్ని నెలలు చిత్రీకరణకు దూరమయ్యా. మానసికంగా, శారీరకంగా కోలుకోవడానికి చాలా టైమ్ పట్టింది. ఆ సమయంలోనే మా బృందంతో కలిసి 'అనగనగా ఒక రాజు' కథ రాసుకున్నా. గత ఫిబ్రవరిలో చిత్రీకరణ ప్రారంభించా. అందరి ప్రేమతో ఆరు నెలల్లోనే సరదాగా షూట్ పూర్తి చేసేశాం. సినిమా చాలా బాగా వచ్చింది. ఇంతటి వినోదాత్మక చిత్రాన్ని పండక్కి విడుదల చేయడమే కరెక్ట్ అనుకున్నాం. ఒకప్పుడు నేను ఏ హీరోల సినిమాలకైతే థియేటర్లకు వెళ్లి సినిమా చూసేవాడినో.. ఇప్పుడు ఆ అభిమాన హీరోల సినిమాలతో పాటు నా చిత్రం విడుదల కానుండటం సంతోషంగా ఉంది. ఈ పండక్కి విడుదలవుతున్న అన్ని చిత్రాలు విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఇన్ని మంచి సినిమాలతో ఈసారి సంక్రాంతి నిజంగానే తెలుగు ప్రేక్షకులకు సినిమా పండగను తీసుకొచ్చింది' అన్నారు. 'ఇదొక మంచి కుటుంబ కథా చిత్రం. దీన్ని అందరూ ఆదరించాలని కోరుతున్నా' అంది నటి మీనాక్షి చౌదరి.




Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com